## రిటైర్డ్ ఉద్యోగులకు తీపి కబురు



మిగతా 2లో..


# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 30 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## సిఎం రేవంత్‌తో కొత్త డిజిపి ఆనంద్ భేటీ



- తనపై నమ్మకంతో డిజిపిగా నియమించినందుకు కృతజ్ఞతలు
- నేడు పదవీవిరమణ చేయనున్న ప్రస్తుత డిజిపి
- 1న బాధ్యతలు తీసుకోనున్న ఆనంద్

హైదరాబాద్, ఏప్రిల్ 28 : తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వ కంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం,పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న సీవీ ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ గా పగ్గాలు చేపట్టడంతో

మిగతా 3లో..

# అధికారం రావడం.. పోవడం రొటీన్





- హామీలు గుప్పించి..ప్రజలను మోసం చేస్తున్న రేవంత్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కెసిఆర్ ఆనాడే హెచ్చరించారు
- రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 28 : అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన

మిగతా 3లో..

## అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం



- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ దాదాపుగా ఇదే అంచనా
- ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వశర్మకే ప్రజల ఓటు

మిగతా 2లో..

## బెంగాల్ ఎగ్జిట్ పోల్స్‌పై భిన్నాభిప్రాయం



- కొన్నింటిలో బిజెపి హవా చాటినట్లు వెల్లడి
- మరికొన్ని పోల్స్‌లో టిఎంసిదే విజయమని ప్రకటన

న్యూఢిల్లీ,ఏప్రిల్ 29 : పశ్చిమబెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ ఓటేశారని ఎగ్జిట్ పోల్స్ చె బుతున్నాయి, టీఎంసీ హవాకు ఈసారి గండి పడి, బీజేపీ విజయం సాధించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. చాణక్య స్ట్రాటజీస్ , మ్యాట్రిజ్, ప్రజాపోల్, పోల్ డైరీ వంటి ఎగ్జిట్‌పోల్స్ బీజేపీకి పట్టం కట్టాయి. పీపుల్స్ పల్స్, జన్‌మత్ పోల్స్, బీకాన్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు టీఎంసీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పాయి. నువ్వా-నేనా అన్న రీతిలో టీఎంసీ-బీజేపీ మధ్య పోటీ ఉందని జేవీసీ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. చాటక్య అం చనా ప్రకారం టీఎంసీకి ఈసారి గట్టి ఎదురు దెబ్బ తగలనుంది. బీజేపీ 150 నుంచి 160 స్థానాలను గెలుచుకోనుంది. టీఎంసీ 130-140 సీట్లు దక్కించుకుంటుంది. కాంగ్రెస్ 2-4 సీట్లు గెలుస్తుంది. మాట్రిజ్ సర్వే సైతం బీజేపీకే పట్టం కట్టింది. బీజేపీ 146-161 సీట్లు, టీఎంసీ 125-140 సీట్లు గెలుచుకుంటాయి. ప్రజా పోల్ సర్వే ప్రకారం బీజేపీ 178-208 సీట్లు గెలుచుకుంటుంది. టీఎంసీ 85-110 సీట్లకే పరిమితమవుతుంది. ఇతరులు జీరో నుంచి 5 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉంది. పోల్ డైరీ సర్వేలోనూబీజేపీ 142-171 సీట్లు గెలుచుకుంటుంది. టీఎంసీ 99-127 సీట్లు దక్కించుకుంటుంది. కాంగ్రెస్ 3-5, ఇతరులు 2-4 స్థానాలు గెలుచుకుంటారు. మమతా బెనర్జీ

మిగతా 3లో..

## జైళ్లశాఖ పాత్ర సమాజంలో కీలకం



- ఖైదీలను సరిదిద్దే ప్రధాన బాధ్యత
- ఢిల్లీ జైలు సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో డిజిపి

మిగతా 2లో..

## రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ



- హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణ
- పర్యాటక కేంద్రాల్లో వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు
- పర్యాటకశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి

హైదరాబాద్,ఏప్రిల్ 29 : రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతా ధికారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరిలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వీటిని నిర్వహించేందుకు ప్లాన్ చేయాలని సూచి ంచారు. రాష్ట్రంలోని కీలక పర్యాటక కేంద్రాల్లో వారాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు

మిగతా 3లో..

## తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి కార్యాచరణ



- 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు
- ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
- అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- కిషన్‌రెడ్డితో మాట్లాడి మహారాష్ట్రను ఒప్పించాలి
- ఉత్తమ్‌ను ఆదేశించిన సిఎం రేవంత్

మిగతా 3లో..

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు

### కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,ఏప్రిల్ 29 : రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఏమాత్రం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పెట్రోల్ డీజి ల్ కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు విష యం తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. నేతలు, సోషల్ మీడియాలో వస్తు న్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళంలో పడొద్దన్నారు. తొందరపడి పెట్రోల్,డీజిల్ ను ఇండ్లలో నిల్వ ఉంచుకోవద్దన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. రాష్ట్రంలో

మిగతా 3లో..

## తండ్రికి విలువ ఇవ్వని కవిత అమ్మ ఎలా అవుతుంది

- అన్నమీద కోపంతో తండ్రిని తిడితే ఎలా
- ఎంతయినా కెసిఆర్ ఉద్యమకారుడు కదా
- కెసిఆర్ లేకుంటే కవిత ఎక్కడ ఉండేవారు
- లిక్కర్ కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు
- తనకు పదవి ఇస్తే మరింత బాగా పనిచేస్తా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మిగతా 3లో..

## తమిళనాట మళ్లీ డిఎంకెదే అధికారం



- విజయ్ పార్టీ ప్రభావం స్వల్పమే
- విపక్షానికే పరిమితం అవుతున్న అన్నడిఎంకు కూటమి

న్యూఢిల్లీ,ఏప్రిల్ 29 : తమిళనాడులో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే మరోసారి సత్తా చాటబోతోందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. ముక్కోణపు పోరులో స్టాలిన్ నేతృత్వంలోని కూటమి విజయ దుందుభి మోగించనుందని అంచనా కట్టాయి. భాజపాతో జట్టుకట్టి బరిలో దిగిన అన్నాడీఎంకేకు మరోసారి నిరాశ తప్పదని సర్వేలు అభిప్రాయపడ్డాయి. సినిమాల నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ పార్టీ టీవీకేకి రెండంకెల సీట్లు రావొచ్చని, అయితే, మూడో స్థానానికే పరిమితమని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. 234 స్థానాలకు గానూ ఏప్రిల్ 23న తమిళనాడులో పోలింగ్ జరిగింది. అధికారం చేపట్టాలంటే 118 స్థానాలు అవసరం. మెజారిటీ సర్వేలు డీఎంకే

మిగతా 3లో..

## ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు



- ప్రతిపాదనలు సిద్ధం చేశాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 29 : ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం మీడియాతో మాట్లాడారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా నాలుగు ప్రతిపాదనలు

మిగతా 3లో..

balagamtv100@gmail.com

# బెంగాల్లో ముగిసిన రెండోదశ పోలింగ్



- 90శాతం దాటిన పోలింగ్
- మరింత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడి
- మళ్లీ తమదే అధికారం అన్న మమతా బెనర్జీ

కోల్‌కతా,ఏప్రిల్ 29 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ముగిసింది. 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే 6 గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఈసీ కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చేటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మెరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా మొదలైంది. పలుచోట్ల బిజెపి, టిఎంసి కార్యకర్తలు ఘర్షణలకు దిగారు. అయితే సిఆర్‌పిఎఫ్ పోలీసులుఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పెద్దగా ఘర్షణలు చోటు చేసుకోలేదు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటేశారు. ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్‌లో పాల్గొన్నారు. కాగా, పోలింగ్ పూర్తయిన వెంటనే టీఎంసీ గెలుపుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం బీజేపీ బెంగాల్‌లో ఓటమి చవిచూడనుందని, మూడింట రెండు వంతుల మెజారిటీతో టీఎంసీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. దీనికి ముందు తాను అభ్యర్థిగా నిలబడిన భవానీపూర్ నియోజకవర్గంలో తన ఓటు హక్కును మమతా బెనర్జీ వినియోగించుకున్నారు. సీఆర్‌పీఎఫ్, కేంద్ర బలగాలపై నిప్పులు చెరిగారు. ఒక్క పోలింగ్ బూత్‌కు కూడా సురక్షితంగా లేదన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లు సీఆర్‌పీఎఫ్ గుప్పిట్లోకి వెళ్లిపోయాయని, ఎక్కడా కూడా రాష్ట్ర పోలీసులు బూత్ వద్ద కనిపించలేదని చెప్పారు. అర్ధరాత్రి నుంచే సీఆర్‌పీఎఫ్ బలగాలు, కేంద్ర పరిశీలకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, టీఎంసీ కార్యకర్తల ఇళ్లల్లో చొరబడ్డారని, టార్చర్ పెట్టారని ఆరోపించారు. 1984 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటికీ ఈ తరహా ప్రజాస్వామ్యం, దౌర్జన్యాలు తానెప్పుడూ చూడలేదన్నారు.

# అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం



- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ దాదాపుగా ఇదే అంచనా
- ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వశర్మకే ప్రజల ఓటు

గౌహతి,ఏప్రిల్ 29 : అస్సాంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని విజయాన్ని నమోదు చేసుకోబోతోంది. బీజేపీ వరుసగా హ్యాట్రిక్ విజయం అందుకోనుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీజేపీ 85 నుంచి 95 సీట్లు గెలుచుకోనుందని మాట్రిజ్ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. కాంగ్రెస్ పార్టీ 25 నుంచి 32 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. కాగా, బీజేపీ 88 నుంచి 98 సీట్లు గెలుచు కుంటుందని, కాంగ్రెస్ 22 నుంచి 32 సీట్లు, ఇతరులు 3-5 సీట్లు గెలుచుకుంటారని చాణక్య స్ట్రాటజీస్ అంచనా వేసింది. 'పీపుల్స్ పల్స్' సైతం బీజేపీకే పట్టం కట్టింది. బీజేపీ 68-72, కాంగ్రెస్ 22-26, ఏజీపీ 7-10, బీపీఎఫ్ 8-9 సీట్లు గెలుచుకుంటాయని తెలిపింది. 'పల్స్ టుడే' అంచనా ప్రకారం బీజేపీకి 88-92 సీట్లు, కాంగ్రెస్‌కు 29-32, ఇతరులకు 4-6 సీట్లు వస్తాయి. ఎస్ఏఎస్ గ్రూప్ సైతం బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని తెలిపింది. బీజేపీ 84-90, కాంగ్రెస్ 40-60, ఇతరులకు 2-3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. యాక్సిస్ మై' ఇండియా సైతం బీజేపీ క్లీన్ స్వీప్ సాధిస్తుందని ఢంకా బజాయించింది. ఎన్డీయేకు 88 నుంచి 100 సీట్లు వస్తాయని తేల్చిచెప్పింది. కాంగ్రెస్ కూటమికి 24 నుంచి 36 సీట్లు రానున్నట్టు తెలిపింది. 48 శాతం ప్రజలు ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వ శర్మ వైపు మొగ్గుచూపుతుండగా, 32 శాతం ఓటర్లు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొంది. కాగా, అస్సాంలో ప్రభుత్వం ఏర్పాటుకు 64 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 9న జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 85.38 శాతం పోలింగ్ నమోదైంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. బెంగాల్ ఎన్నికలు ముగియడంతో బుధవారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి.

# రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు



- 90 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 29 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ధి చేకూరింది. అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు పక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి.

# రిటైర్డ్ ఉద్యోగులకు తీపి కబురు



## బకాయిల చెల్లింపులకు వేయికోట్ల విడుదల

## ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

హైదరాబాద్,ఏప్రిల్ 29 : ఇటీవల కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తొలివిడతలో బుధవారం వేయికోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ. 1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధుల విడుదల చేయటం జరిగింది. గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ. 700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన వెయ్యి కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల చొప్పున చెల్లిస్తూ వస్తోంది.ఏప్రిల్ బకాయిల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచింది. మిగిలిన ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే నెలకు వెయ్యి కోట్ల చెప్పున విడుదల చేస్తూ బకాయిలన్నింటీని క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల మెడికల్ బిల్లులను కూడా ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి.

# తండ్రికి విలువ ఇవ్వని కవిత అమ్మ ఎలా అవుతుంది



- అన్నమీద కోపంతో తండ్రిని తిడితే ఎలా
- ఎంతయినా కెసిఆర్ ఉద్యమకారుడు కదా
- కెసిఆర్ లేకుంటే కవిత ఎక్కడ ఉండేవారు
- లిక్కర్ కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు
- తనకు పదవి ఇస్తే మరింత బాగా పనిచేస్తా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

యాదాద్రిభువనగిరి, ఏప్రిల్ 29 : తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. ఈ మేరకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైం దన్నారు. మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుం టుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, రాజకీయ చర్యలపై స్పందిస్తూ ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ ఏర్పాటు విషయాన్ని రాజగోపాల్ రెడ్డి 'బిగ్ జోక్'గా అభివర్ణించారు. అదే విధంగా టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టడం మరో జోక్ అని వ్యాఖ్యానించారు. కవితకు ఉన్న గుర్తింపు కేవలం ఒక ఉద్యమకారుడు బిడ్డగా మాత్రమేనని, ఆమె స్వతంత్ర రాజకీయ నాయకత్వం ఇంకా నిరూపించుకోలేదని అన్నారు. మొదటి సమావేశంలోనే తన తండ్రి అయిన కేసీఆర్‌ను విమర్శించడం సరైంది కాదని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తండ్రిపై గౌరవం, ప్రేమ ఉండాలని, అలాంటి విలువలు లేకపోతే ఆమె వ్యక్తిత్వం ప్రశ్నార్థకమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందిఅంటూ ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కవిత అన్నపై ఉన్న కోపాన్ని తండ్రిపై చూపడం సరికాదని అన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయ వేదికపైకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆయన సూచించారు. కవితపై ఉన్న మద్యం కుంభకోణం ఆరోపణల విషయమై.. ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, నిర్దోషి అని తేలలేదని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం డబ్బులు ఉన్నాయనే కారణంతో పార్టీ పెట్టడం అంత సులువు కాదని, అది పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదని వ్యాఖ్యానించారు. తనంతట తాను పోటీ చేసినా కవితకు డిపాజిట్ కూడా రాదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఇక తన రాజకీయ భవిష్యత్తుపై మాట్లాడుతూ, అధిష్టానం తనకు పెద్ద పదవి ఇస్తే ఆ బాధ్యతను న్యాయంగా నిర్వహిస్తానని తెలిపారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# దర్శకుడు, జర్నలిస్ట్ రఘురామ్ హఠాన్మరణం

హైదరాబాద్,ఏప్రిల్ 29 : తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుంది. ప్రముఖ దర్శకుడు, సీనియర్ జర్నలిస్ట్ బండి రఘురామ్ ( 56) కన్నుమూశారు. హైదరాబాద్ మధురానగర్‌లో నివాసముంటున్న ఆయన.. మంగళవారం వాకింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే బంధువులు, సన్నిహితులు ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బండి రఘురామ్ కేవలం సినీ దర్శకుడే కాదు. జర్నలిజంలో ఎం.ఫిల్, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. లిబియన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన, సినిమాలపై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగాన్ని వదిలి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ప్రముఖ దర్శకుడు సానా యాదిరెడ్డి వద్ద 'పిట్టల దొర', 'బ్రహ్మచారి' వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పనిచేసి దర్శకత్వ మెళకువలు నేర్చుకున్నారు. 2004లో శివాజీ, రమ్య కృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన 'వరం' చిత్రంతో రఘురామ్ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించక పోయినప్పటికీ, దర్శకుడిగా ఆయన ప్రతిభను చాటుకుంది. ఆ తర్వాత పలు చిత్రాలకు రైటర్‌గా, ఘోస్ట్ రైటర్‌గా తన సేవలను అందించారు. ఇటీవల మళ్ళీ మెగాఫోన్ పట్టేందుకు ప్రయత్నాలు చేస్తూ, స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సినిమాల్లోకి రాకముందు, వచ్చాక కూడా రఘురామ్ జర్నలిజం రంగంలో చురుగ్గా ఉండేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఈటీవీ, వీ6 వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ముఖ్యంగా ఆయన ఇచ్చే సినిమా రివ్యూలకు, విశ్లేషణలకు పాఠకుల్లో మంచి గుర్తింపు ఉండేది. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు, జర్నలిస్ట్ మిత్రులు దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేస్తున్నారు. రఘురామ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకేసారి అటు సినీ రంగంలో, ఇటు మీడియా రంగంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రభుత్వ పరమైన హైదరాబాద్ మెట్రో

## వందశాత్ షేర్ల బదిలీ పూర్తి

హైదరాబాద్,ఏప్రిల్ 29 : హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ పరమైంది. ఎల్ అండ్ టీతో షేర్ల కొనుగోలు ఒప్పందం పక్రియ పూర్తయ్యింది. రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ జరిగింది. ఈ ఒప్పందంపై హెచ్ఎంఆర్ఎల్ తరపున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ లిమిటెడ్ తరపున డీకే సేన్, ఎల్అండ్‌టీ మెట్రోరైలు హైదరాబాద్ లిమిటెడ్ తరపున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. వాస్తవంగా మార్చి 31ని మెట్రో స్వాధీన తేదీ అనుకున్నప్పటికీ.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం మంజూరు ఆలస్యం కావడంతో గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు. ఎల్ అండ్ టీ, మెట్రో రైల్ హైదరా బాద్ లిమిటెడ్ సంస్థ 2017 నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-ఎను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫేజ్-ఎను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-ఎ, ప్రతిపాదిత ఫేజ్-ఎఎ నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, సేవల అమలు సులభతరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# స్కాలర్‌షిప్ నిధుల సమస్యకు పరిష్కారం

## అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సిఎం భట్టి



హైదరాబాద్,ఏప్రిల్ 29 : రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్ నిధుల సమస్యను పరిష్కరించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. గత కొంతకాలంగా సాంకేతిక కారణాలు లేదా నిధుల కొరత వల్ల ఆగిపోయిన స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే క్లియర్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ సందర్భంగా మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదు. అందుకే స్కాలర్ షిప్ విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో నిధులు అందేలా చూస్తాం. విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రాధాన్యత. స్కాలర్‌షిప్ నిధుల విడుదల పక్రియను వేగ వంతం చేసి, విద్యార్థులకు భరోసా కల్పిస్తాం' అని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొని, ప్రస్తుత నిధుల స్థితిగతులు, పెండింగ్ దరఖాస్తుల వివరాల ను డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలగనుంది.

# అనూహ్యంగా పెరిగిన ఇంధన విక్రయాలు

- రాష్ట్రంలో తగినన్ని పెట్రో,డీజిల్ నిల్వలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం

హైదరాబాద్,ఏప్రిల్ 29 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజుల నుంచి పెట్రోల్, డీజిల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్, డీజిల్‌కు కొరత ఏర్పడడంతో పలు బంక్‌లు మూతబడ్డాయి. దీంతో వాహనదారులు తీసి ఉన్న బంక్‌ల వద్ద బారులు తీరారు. తాజాగా, పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రాష్ట్రంలో ఎక్కడా కొరత లేదని, కావాల్సినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో ఇంధన విక్రయాలు అనూహ్యంగా పెరిగాయి. పారిశ్రామిక డీజిల్ ధరలు పెరగడంతో, బల్క్ వినియోగదారులు కూడా రిటైల్ బంకులపై ఆధారపడటం వల్ల సాధారణ బంకులపై ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు ధరలు పెరుగుతాయన్న వదంతులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితిని సమీక్షించిన ప్రభుత్వం, ఇంధన సరఫరాలో అంతరాయం కలగకుండా హై అలర్ట్ ప్రకటించాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,536 బంకుల ద్వారా నిరంతర సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఇంధన సరఫరాలో సమస్యలు ఉన్నా లేదా ఫిర్యాదులు చేయాలన్నా 1967 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయండి. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లో ఇంధన నిల్వలపై ప్రభావం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టింది. రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వదంతులను నమ్మి అనవసరంగా ఆందోళన చెందవద్దని అన్నారు.

# అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీ ప్రారంబించిన శ్రీధర్ బాబు

హైదరాబాద్,ఏప్రిల్ 29 : ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీ హైనెకెన్ హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్టిక్ట్ లో 'హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా' పేరిట ఏర్పాటయ్యింది. దాదాపు 76వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు.ఇది ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ, అనలిటిక్స్ రంగాల్లో గ్లోబల్ సర్వీసులను అందించే స్ట్రాటజిక్ సెంటర్ గా పని చేయనుంది. ప్రస్తుతం 300 మందికి పైగా నిపుణులకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 1600కు చేరుకోనుంది.ప్రపంచ బ్రూయింగ్ రంగంలో 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఒక దిగ్గజ సంస్థ హైనెకెన్. ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల్లో హైనెకెన్ ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి. 70కి పైగా దేశాల్లో 165 కంటే ఎక్కువ బ్రూవరీలను హైనెకెన్ కలిగి ఉంది

## తమిళనాట మళ్లీ డిఎంకెదే అధికారం

అధికారం రావొచ్చని అంచనా వేశాయి. అయితే ఎన్డీటీవీ- యాక్సిస్ మైఇండియా కలిసి నిర్వహించిన సర్వే మాత్రం విజయ్ నేతృత్వంలోని టీవీకేకు అందరి కంటే ఎక్కువ స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. జేవీసీ అనే సర్వే సంస్థ అన్నాడీఎంకే కూటమికి అధికారం రావొచ్చని అంచనా వేసింది. మే 4న తుది ఫలితాలు వెల్లడి కానున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అధికార ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్, భాజపా కూటమి మరోసారి అధికారంలోకి రావొచ్చని పలు సర్వేలు అభిప్రాయపడ్డాయి. 30 స్థానాల్లో ఎన్నికలు జరగ్గా.. మెజారిటీ సర్వేలు ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి వైపు మొగ్గుచూపాయి. కాంగ్రెస్, డీఎంకే కూటమి రెండో స్థానానికి పరిమితం కానున్నాయి.

## సిఎం రేవంత్‌తో కొత్త డిజిపి ఆనంద్ భేటీ

పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.సీఎం రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ (1991 బ్యాచ్)ను డీజీపీగా నియమిస్తూ సీఎస్ కే.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత డీజీపీ బి.శివధర్‌రెడ్డి ఏప్రిల్30న పదవీవిరమణ పొందనున్నారు. ఈ క్రమంలోనే మే 1న సీవీ ఆనంద్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారుల్లో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారి. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పంపిన విషయం తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యామిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడంతో డీజీపీ హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్(-హెచ్ఓపీఎఫ్)గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి డీజీపీలు నియమితులైన అందరూ తొలుత ఇంచార్జి డీజీపీగాలు బాధ్యతలు నిర్వహించగా.. సీవీఆనంద్ మాత్రం పూర్తిస్థాయి డీజీపీగా నియమితులు కావడం గమనార్హం. డీజీపీగా 2028 జూన్ వరకు సీవీ ఆనంద్ కొనసాగనున్నారు.

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు

ప్రజల అవసరాలకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారుకేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణలో రోజుకు 6వేల 400 కిలో లీటర్ల పెట్రోల్ అవసరం ఉండగా.. ఈ రోజు 10వేల 300 కిల లీటర్ల పెట్రోల్ సప్లయ్ జరిగిందన్నారు. డీజిల్ 8వేల కిలో లీటర్ల అవసరం ఉండగా..19వేల 300 కిలో లీటర్ల సప్లయ్ చేశామన్నారు. అమెరికా , ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోల్ డీజిల్ దిగుమతిలో కొంత సమస్య ఏర్పడింది వాస్తవమే.. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశంలోగానీ, రాష్ట్రంలో గానీ పెట్రోల్ డీజిల్ కొరత లేదన్నారు. 88 శాతం చమురు ఉత్పత్తులను ప్రపంచ దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం..మనకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారు కిషన్ రెడ్డి. ఒకవేళ స్టాక్ లేకపోతే పజలకు చెప్తాం.. కావాలనే ప్రతిపక్ష నేతల రేట్లు పెరుగుతాయనిప్రచారం చేస్తున్నారు వారిమాటల నమ్మొద్దన్నారు. రాహుల్ గాంధీ లాంటి ప్రతి పక్ష నేతలు రాజకీయ నేతలు చేస్తున్న పానిక్ కామెంట్లతో ప్రజలు గందరగోళానికి గురవతున్నారు. పెట్రోల్, డీజిల్ ను ఇండ్లలో స్టాక్ పెట్టుకుంటున్నారు.. అసలే ఎండాకాలం ఇది మంచిది కాదని కిషన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

## రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ

నిర్వహించాలని తెలిపారు. సోమశిల, రామప్ప, యాదాద్రి ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గోల్కొండ, తారామతి బరాదరిలలో జరుగుతున్న పనులపై ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షించారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల ఏర్పాట్లపై రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రతి టూరిజం ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారులను నియమించాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగరాన్ని సుందరీకరిస్తామని తెలిపారు. స్కైవాక్‌లు, శిల్పాలతో హైదరాబాద్‌కు కొత్త ఆకర్షణ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు,÷లంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాల్లో తెలంగాణ టూరిజంపై ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. చైనా, వియత్నాం టూరిజం మోడళ్ల గురించి అధ్యయన యాత్రలపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వరంగల్, సోమశిలలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్ల ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి జూపల్లి చెప్పారు. రామప్ప దేవాలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.

## బెంగాల్ ఎగ్జిట్ పోల్స్‌పై భిన్నాభిప్రాయం

మరోసారి ఘనవిజయం సాధించనున్నట్టు మరికొన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. టీఎంసీ 177-187 సీట్లు గెలుచుకుని మరోసారి విజయం హస్తగతం చేసుకుంటుందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. బీజేపీ 95-110 సీట్లు దక్కనున్నాయి. కాంగ్రెస్ 1-3 సీట్లు గెలుచుకుంటుందని, సీపీఎం సారథ్యంలోని లెఫ్ట్ ఫ్రంట్ ఖాతా కూడా తెరవదని అంచనా వేసింది.టీఎంసీకి అఖండ్ విజయం సాధిస్తుందని జన్‌మత్ పోల్స్ అంచనా వేసింది. టీఎంసీకి 195-200 సీట్లు వస్తాయని, బీజేపీ 80-90 సీట్లు దక్కించుకుటు ందని, కాంగ్రెస్ 1-3 సీట్లు, వామపక్షాలకు 0-1 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. కాగా, టీఎంసీ, బీజేపీ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని జేవీసీ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. టీఎంసీకి 131-152, బీజేపీకి 138-159 సీట్లు వస్తాయని అంచనా వేసింది. కాంగ్రెస్-2, ఇతరులకు ఒక సీటు వస్తాయని జోస్యం చెప్పింది.

## ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు

ప్రభుత్వం ముందుకు తెచ్చారని వివరించారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అనుకూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరగనున్న సమీక్షా సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్పీటీ టెస్ట్‌లు నిర్వహించాలి. ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మిబిలిటీ టెస్ట్‌లు జరపాలి. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలి. బ్యారేజ్‌ల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటీ బ్యారేజ్‌లను సందర్శించి టైంలైన్‌ను ఫిక్స్ చేసుకోవాలి. అచిఖఖా డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలి. పునరుద్ధరణ కోసం జరుగుతున్న పురోగతి పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఔఆ÷ూంకు సమగ్రంగా సమాచారం అందించాలి.' అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు.

## అధికారం రావడం..పోవడం రొటీన్



మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

# సముద్ర వనరుల ద్వారా స్థానిక సముదాయాలకు లాభాలు

- మత్స్య సంపదలో ఆంధప్రదేశ్ అగ్రస్థానం
- అక్రమ వేటపై కట్టడికి కఠిన చర్యలు
- జీవవైవిధ్య చట్టం అమలు ద్వారా మత్స్యకారులు, రైతులకు లెవీ
- ఏపీఎస్‌బీబీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్

విజయవాడ,ఏప్రిల్ 29 : బయోడైవర్సిటీ చట్టం లోని యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానం ద్వారా ప్రకృతి వనరుల వినియోగం వల్ల వచ్చే లాభాలను స్థానిక ప్రజలకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని ఏపీఎస్‌బీబీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ వల్ల చేపల ధరలు ఏమాత్రం పెరిగే అవకాశం లేదన్నారు. చెన్నై లోని నేషనల్ బయోడైవర్సిటి అథారిటీ , అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయో డైవర్సిటి బోర్డు సంయుక్తంగా, సముద్ర జీవ వైవిధ్య వనరుల వినియోగంలో యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానంపై ప్రత్యేక వర్క్ షాపు ను స్థానిక మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో బుధవారం ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ... ఎర్రచందనం విక్రయాల ద్వారా రైతులకు 5శాతం లాభం అందజేస్తూ, గత మూడు నెలల్లో సుమారు 7 కోట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇదే విధానాన్ని సముద్ర సంపదపై కూడా అమలు చేసి, మత్స్యకారులకు ప్రయోజనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2025లో సముద్ర సంపద విలువ 4,155 కోట్లకు చేరిందని, ప్రాసెసింగ్ తర్వాత అది మరింత దాదాపు రూ. 9 వేల కోట్లకు పైగా పెరుగుతుందని తెలిపారు. ఎగుమతిదారుల టర్నోవర్ ఆధారంగా 0.2 శాతం నుంచి 0.6 శాతం వరకు ఏబీఎస్ రుసుము వసూలు చేసి, ఆ నిధులను మత్స్యకారుల సంక్షేమానికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 13,000 బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలను బలోపేతం చేసి, ఈ నిధులను జెట్టీలు, ఇన్సూరెన్స్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. సముద్ర జీవవైవిధ్య సంరక్షణతో పాటు మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధన ఈ విధానం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. సముద్ర వనరులను పరిశోధనలు, ఔషధ తయారీ , ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో వినియోగించే సంస్థలు పొందే లాభాల్లో కొంత భాగం స్థానిక సముదాయాలకు చేరేలా చూడటం ఏబీఎస్ విధానం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు పంపిణీ చేసిన ?145 కోట్ల ఏబీఎస్ నిధుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక్కటే ?97 కోట్లను పొందడం గర్వకారణమని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఈ నిధుల్లో ఎక్కువ భాగం ఎర్రచందనం మరియు వ్యవసాయ రంగం ద్వారా లభిస్తున్నాయని, భవిష్యత్తులో సముద్ర వనరుల ద్వారా కూడా స్థానిక బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలకు మరింత లాభం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నేషనల్ బయోడైవర్సిటి అథారిటీ చైర్మన్ వీరేంద్ర తివారి మాట్లాడుతూ... సముద్ర వనరుల వినియోగంలో యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానం కీలకమని తెలిపారు. ఈ దిశగా 2025లో 'అక్వాటిక్ జెనెటిక్ ఎక్స్ పర్ట్ కమిటీ'ను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా తీరప్రాంతాల్లో లభించే చేపల జాతుల సమగ్ర జాబితాను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ జాబితా ఆధారంగా ఎగుమతిదారుల టర్నోవర్ లేదా ఉత్పత్తుల విలువను బట్టి ఏబీఎస్ నిధులను వసూలు చేసి, తీరప్రాంత మత్స్యకారులకు అందజేయనున్నట్లు వివరించారు. కొల్లేరు సరస్సు జీవవైవిధ్య పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించిందని, కాంటూర్ పరిమితులు, స్థానికుల జీవనోపాధిని సమతుల్యంగా కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ స్థానిక ప్రజల జీవనోపాధిని రక్షించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ?పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ... సముద్ర కాలుష్య నియంత్రణతో పాటు మత్స్యకారుల జీవనోపాధి బలోపేతం అవసరమన్నారు. తీరప్రాంతాల్లో పారిశ్రామిక వ్యర్థాలు, పట్టణ మురుగునీరు సముద్రంలో కలవడం వల్ల చేపల నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వలలు, బాటమ్ ట్రాలింగ్ వంటి అశాస్త్రీయ పద్ధతులు సముద్ర వనరులకు నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మత్స్యకారులపై వేట ఒత్తిడిని తగ్గించేందుకు మెరికల్చర్, చేపల అనుబంధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరరేఖ, 350 ల్యాండింగ్ సెంటర్లు మరియు 555 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 8 లక్షల సముద్ర తీరప్రాంత ప్రజలు, 20 లక్షల అంతర్భాగ మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. 2025-26లో దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం 38శాతం వాటా సాధించిందని తెలిపారు. భారీ ట్రాలర్ల ద్వారా జరిగే విధ్వంసకర చేపల వేట చిన్న మత్స్యకారులకు ఇబ్బందిగా మారిందని, దీనిని అరికట్టేందుకు మత్స్యశాఖ, అటవీశాఖ, మెరైన్ పోలీసులతో కలిసి నిఘా కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు బి.మల్లికార్జునరావు, ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పారెస్ట్ డిపార్ట్ మెంట్ కు చెందిన సీసీఎస్ నాగేశ్వరరావు, బయోడైవర్సిటీ చెందిన నిపుణులు తదితరులు హాజరయ్యారు.

## తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి కార్యాచరణ

- 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు
- ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
- అధికారలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- కిషన్‌రెడ్డితో మాట్లాడి మహారాష్ట్రను ఒప్పించాలి
- ఉత్తమ్‌ను ఆదేశించిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఏప్రిల్ 29 : తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని సిఎం అన్నారు. ఒకవేళ ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ బ్యారేజ్‌పై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు. ఇక్కడి నుంచి నీళ్లు తరలించడం సులవుగా ఉంటుందని అన్నారు. నీటి లభ్యత కూడా ఎక్కువేనని అన్నారు. అయితే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా నాలుగు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెచ్చారని వివరించారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యో ఖర్చు, అనుకూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తు న్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమీక్షా సమావేశంలో దీనిపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. అధికారులు సూచించిన ప్రతిపాదనలను సిఎం పరిశీలించారని అన్నారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్పీటీ టెస్ట్‌లు నిర్వహించాలి. ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మిబిలిటీ టెస్ట్‌లు జరపాలి. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలి.బ్యారేజ్‌లపునరుద్ధరణకోసం నియమించిన సమన్వయ కమిటీ బ్యారేజ్‌లను సందర్శించి టైంలైన్‌ను ఫిక్స్ చేసుకోవాలి.డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలి. పునరుద్ధరణ కోసం జరుగుతున్న పురోగతి పనుల వివరాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా సమాచారం అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇరిగేషన్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమావేశం లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటుఆ శాఖ అధికారులతో భేటీ అయ్యారు.

## జైళ్లశాఖ పాత్ర సమాజంలో కీలకం





- ఖైదీలను సరిదిద్దే ప్రధాన బాధ్యత
- ఢిల్లీ జైలు సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో డిజిపి

హైదరాబాద్,ఏప్రిల్ 29 : జైళ్ల శాఖ పాత్ర సమాజానికి అత్యంత ముఖ్యమని, ఇది సులభమైన పని కాదని డిజిపి శివధర్ రెడ్డి పేర్కొన్నారు. జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పని కాదని, అది ఖైదీలను సరిదిద్దుతూ సమాజంలో తిరిగి కలిపే బాధ్యత అని చెప్పారు. శిక్షణార్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాతిత్వం మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను గౌరవంతో చూడాలని సూచించారు. వారికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఢిల్లీ జైళ్ల సిబ్బందికి ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని సికాలో తెలంగాణ డీజీపి శివధర్ రెడ్డి ప్రారంభించారు. ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ఈరోజు చంచల్‌గూడలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమం రాష్ట్రాల మధ్య సమన్వయం మరియు సంస్కరణ పరిపాలనలో పరస్పర సహకారానికి ప్రతీకగా నిలుస్తోంది. 2026 సంవత్సరంలో మొత్తం 381 మంది ఢిల్లీ జైళ్ల సిబ్బంది దశలవారీగా శిక్షణకు ఎంపికయ్యారు. నేడు ప్రారంభమైన మొదటి దశలో 62 మంది శిక్షణార్థులు పాల్గొంటున్నారు. వీరిలో 61 మంది ఢిల్లీ జైళ్ల శాఖకు చెందినవారు, 1 తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్ ఉన్నారు. ఇది అంతర్రాష్ట్ర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. తొమ్మిది నెలల సమగ్ర శిక్షణ కార్యక్రమం శిక్షణార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యం, క్రమశిక్షణ మరియు మానవతా దృక్పథాన్ని పెంపొందించేలా రూపొందించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంతర్గత శిక్షణ, జైలు నియమాలు, క్రిమినాలజీ, విక్టిమాలజీ / పెనాలజీ, సైకాలజీ, సోషియాలజీ / సోషల్ వర్క్, క్రిమినల్ చట్టాలు, రాజ్యాంగ విలువలు / మానవ హక్కులు, జైలు పరిపాలనలో సాంకేతికత. బాహ్య శిక్షణ శారీరక వ్యాయామం, బిపిఆర్ / డి ప్రమాణాల ప్రకారం పరేడ్, యోగా / ధ్యానం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణార్థులు సికా ఆధునిక సదుపాయాలను వినియోగించుకోనున్నారు. వీటిలో సదుపాయాలుతో కూడిన తరగతి గదులు, ఎయిర్ కండిషన్ ఆడిటోరియం, సమృద్ధిగా పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, 400 మందికి వసతి గల హాస్టళ్లు, ప్రత్యేక శిక్షణ మైదానాలు, జిమ్ మరియు పరిశుభ్రమైన భోజనశాల ఉన్నాయి. ÷ూ. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ శిక్షణ మరియు అంతర్రాష్ట్ర సహకారం సంస్కరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని పేర్కొన్నారు. ఢిల్లీ జైళ్ల డైరెక్టర్ జనరల్ సికాపై విశ్వాసం ఉంచి ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బందిని శిక్షణకు పంపడం గర్వకారణమని తెలిపారు. ఇది సికా ఉన్నత ప్రమాణాలపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ అధికారులు మరియు సిబ్బంది శివధర్ రెడ్డి 60వ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## అత్యాచార బాధిత మహిళకు భరోసా

### కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న శైలజ

అమరావతి,ఏప్రిల్ 29 : విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం ఈ ఘటనలో బాధిత మహిళకు రాయపాటి శైలజ వీడియో కాల్ చేసి.. ఫోన్‌లో పరామర్శించారు. న్యాయం చేస్తామని ఈ సందర్భంగా బాధితురాలికి రాయపాటి శైలజ హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివ రాలను రాయపాటి శైలజ.. బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు.పల్నాడు జిల్లా రెంట చింతలకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో నివసిస్తున్నారు. గత ఆదివారం సాయంత్రం వివాహిత విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించింది. గుర్తు తెలియని వ్యక్తి జనరల్ బోగీలో ఉన్న ఆమెను ఏసీ బోగీలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత మహిళ.. రెంటచింతల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం ఆమెను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ అత్యాచార ఘటన బహిర్గతం కావడంతో ఈ ఘటనపై రెంటచింతల పోలీసులతో మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు రాయపాటి శైలజ సూచించారు.

## ఆకివీడు రామాలయ కేసు డిస్పోజ్ చేసిన హైకోర్టు

అమరావతి,ఏప్రిల్ 29 : ఆకివీడు రామాలయంపై వేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు డిస్పోజ్ చేసింది. ఇదే అంశంపై ఇప్పటికే హైకోర్టులో మరో బెంచ్ ముందు రిట్ పిటిషన్‌తో పాటు కోర్టుధిక్కరణ పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉన్నాయని కోర్టు తెలిపింది. అక్కడే తేల్చుకోవాలని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ పిల్‌ను ముందుగా డిస్మిస్ చేస్తామని హైకోర్టు చెప్పగా.. పిల్ తరఫున హాజరైన న్యాయవాది శ్రవణ్ కుమార్ డిస్పోజ్ చేయాలని అభ్యర్థించారు. దీంతో పిల్‌ను డిస్పోజ్ చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ధర్మాసనం ప్రకటించింది.

## రీజెన్సీ సిరామిక్ వ్యవస్థాపకుడు జీఎన్ నాయుడు కన్నుమూత

యానాం,ఏప్రిల్ 29 : ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు(87) కన్ను మూశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. 1983లో రీజెన్సీ సెరామిక్స్‌ను జీఎన్ నాయుడు ప్రారంభించారు.యానాంలోని రీజెన్సీ సెరామిక్స్ కంపెనీలో గతంలో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. 2012 జనవరిలో కార్మికులు తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఆ సమయంలో కార్మిక సంఘం నాయకుడి మృతితో మిగతా కార్మికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ప్లాంట్‌లోకి ప్రవేశించి పెను విధ్వంసం సృష్టించారు. పరిశ్రమలోని వాహనాలు, యంత్రాలకు నిప్పు పెట్టి ధ్వంసం చేశారు. కంపెనీ రికార్డులను తగలబెట్టారు. ఈ ఘటనలో రీజెన్సీ కంపెనీ ప్రెసిడెంట్ కేసీ చంద్రశేఖర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాత్మక ఘటన కారణంగా రీజెన్సీ సెరామిక్స్ కంపెనీ లాకౌట్ ప్రకటించింది. దాదాపు దశాబ్దం పాటు మూతపడిన ఈ కంపెనీని 2024లో తిరిగి పునరుద్ధరించారు.

## ఎపికి కేంద్రం నుంచి 207 కోట్లు విడుదల

### స్వయం సంఘాల బలోపేతానికి ఉపయోగం

### కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

అమరావతి,ఏప్రిల్ 29 : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు విడుదల చేసింది. దీనదయాళ్ అంత్యోదయ యోజన , జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద రూ.207 కోట్ల నిధులు విడుదల చేసింది. 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి ఈ నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల విడుదలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ఈ నిధులు గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబనను పెంపొందించి, కుటుంబాల ఆదాయ స్థాయిని మెరుగుపరుస్తాయని తెలిపారు. అలాగే ÷నాన్షియల్ ఇన్‌క్లూజన్‌ను వేగవంతం చేస్తూ, వేలాది కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేందుకు దోహదపడతాయని చెప్పారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణాభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆస్తికోసం కన్నకూతురు ఘాతుకం

- తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి నిప్పు
- ప్రమాదం నుంచి బయటపడ్డ దంపతులు

**బలగం టీవి, పల్నాడు**

చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి కోసం కూతురు కన్నతల్లిదండ్రుల ఇంటికే నిప్పు పెట్టింది. వారు చనిపోవాలని చూసింది. అదృష్టవశాత్తు వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆస్తి వివాదం కారణంగా తల్లిదండ్రులపై కూతురు కర్కశంగా వ్యవహరించింది. కన్న తల్లిదండ్రులను కూతురు చంపాలని చూడటం చర్చనీయాంశంగా మారింది. చిలకలూరిపేటకు చెందిన తల్లిదండ్రులు, కూతురికి మధ్య ఆస్తి విషయాల్లో తరచూ గొడవలు జరుతున్నాయి. ఆస్తిని ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో కోపం పెంచుకున్న కూతురు.. వారి ప్రాణాలు తీయడానికి సిద్ధమైంది. గత రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టింది. మంటలను గుర్తించిన తల్లిదండ్రులు సకాలంలో ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంటలు వ్యాపించడంతో ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కూతురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.




# మోడీ సభ పోస్టర్ ఆవిష్కరణ

**బలగం టీవి, హైదరాబాద్**

మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం చేసినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వెల్లడించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్‌కు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.7 వేల కోట్లకుపైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అడ్డుకుంది. ఉత్తరాది, దక్షిణాది పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

# నేడు ఏపీ టెన్త్ ఫలితాలు విడుదల

- ఎక్స్ వేదికగా వెల్లడించిన మంత్రి లోకేశ్

**బలగం టీవి, అమరావతి**

ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాలు గురువారం విడుదలకానున్నాయి. ఈ మేరకు విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదలవుతాయని మంత్రి వెల్లడించారు. స్కూల్ లాగిన్ ద్వారా హెడ్ మాస్టర్లు నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు తమ ఫలితాలను వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని మంత్రి తెలిపారు. అలాగే మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' మెసేజ్ చేసి ఫలితాలను చూడవచ్చన్నారు. లీప్ యాప్ ద్వారా కూడా విద్యార్థులు తమ రిజల్ట్స్‌ను తెలుసుకోవచ్చని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాశారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పది పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫలితాలు విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి చెక్ చేసుకోవచ్చు.

# మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

- ట్రంప్‌కు బిట్రన్ రాజు ఛార్లెస్ చురకలు

వాషింగ్టన్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): బ్రిటిష్ వారు లేకపోతే అమెరికా ప్రజలు ఫ్రెంచ్ మాట్లాడాల్సి వచ్చేదంటూ బ్రిటన్ రాజు ఛార్లెస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎద్దేవా చేస్తూ చురకలు అంటించారు. మంగళవారం రాత్రి అధ్యక్ష కార్యాలయంలో జరిగిన స్టేట్ డిన్నర్‌లో ఆయన సరదాగా మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సహాయం చేయకపోతే యూరోపియన్ దేశాల ప్రజలు జర్మన్, జపనీస్ మాట్లాడేవారని ట్రంప్ గతంలో అన్న మాటలను బ్రిటన్ రాజు గుర్తుచేశారు. 'అధ్యక్షా.. అమెరికా లేకపోతే యూరోపియన్ దేశాలు జర్మన్ మాట్లాడేవని మీరు ఇటీవల వ్యాఖ్యానించారు. నేనేం చెబుతున్నానంటే ఒకవేళ మేము లేకపోతే, మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారు' అని చార్లెస్ చమత్కరించారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్ర్యం రాకముందు.. ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. లండన్–వాషింగ్టన్ మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాన్ని కొనియాడారు. అనంతరం ట్రంప్

మాట్లాడుతూ.. స్టేట్ డిన్నర్‌లో అద్భుతమైన ప్రసంగం చేసినందుకు బ్రిటన్ రాజును అభినందించారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తమకు మద్దతిచ్చేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ముందుకు రాకపోవడాన్ని విమర్శించారు.

# సోనమ్‌కు బెయిల్‌పై సవాల్

- మేఘాలయ హైకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం

**బలగం టీవి, భోపాల్**

సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్‌కి బెయిల్ ఇవ్వడంపై సవాల్ చేయాలని రఘువంశీ కుటుంబం నిర్ణయించింది. సోనమ్‌కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించ నున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు మెమోలో సెక్షన్ 403(1) అని ప్రస్తావించారు. బీఎన్ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేదు. సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అరెస్టు మెమోలోనే కాకుండా.. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించ డాన్ని మేఘాలయ కోర్టు గుర్తించింది. సాంకేతిక తప్పిదమనే పోలీసుల వాదనలను తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. దీంతోపాటు సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి గాజీపుర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేక పోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనమ్‌కు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. గతేడాది మే 11న అతడికి సోనమ్ తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వీరు కన్పించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమే భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, వీరిలో ముగ్గురికి ఇప్పటికే బెయిల్ లభించింది.

# తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

- విమాన ధరలతో ప్రయాణికుల వెనకడుగు
- భక్తులు తగ్గడంతో శ్రీవాణి టిక్కెట్లపై ప్రభావం

**బలగం టీవి, తిరుపతి**

విమాన ప్రయాణ ధరలు తిరులమ భక్తులపై పడింది. గల్ఫ్ యుద్ధంతో భారీగా పెరిగిన విమాన ధరల కారణంగా తిరుపతికి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఈ ప్రభావం శ్రీవాణి టిక్కెట్లపైనా పడింది. తిరుపతి విమానాశ్రయంలో ఒకటిన్నర నెలలుగా శ్రీవాణి ట్రస్టు దాతలకు జారీ చేసే టికెట్లు మిగిలిపోతున్నాయి. రోజూ 40 శాతానికిపైనే టికెట్లు జారీ చేయకుండానే కౌంటర్‌ను మూసివేయాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ రోజూ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800, విమానాశ్రయంలో 200 చొప్పున శ్రీవాణి టికెట్లను జారీ చేస్తోంది. ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసే 800 టికెట్ల కోటా క్షణాల్లో పూర్తవుతుంటే విమానాశ్రయంలో జారీ చేసే 200 టికెట్లలో సగానికిపైగానే మిగిలిపోతున్నాయి.

గతంలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి హైదరాబాదు నుంచి తిరుపతికి ఐదు విమాన సర్వీసులు నడిచేవి. ఈక్రమంలో మధ్యాహ్నం 11 గంటలకే 200 టికెట్ల కోటా విక్రయాలు పూర్తయ్యేవి. ఇటీవల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. విమాన టికెట్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రయాణికుల రాకపోకలు చాలావరకు తగ్గిపోయిన క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. సాధారణంగా శ్రీవాణి టికెట్లు కలిగిన భక్తులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. ఈక్రమంలో రెండు గంటల ముందు అంటే మధ్యాహ్నం రెండు గంటలకు విమానాశ్రయంలోని కౌంటర్‌ను మూసివేస్తున్న క్రమంలో రోజూ 50 నుంచి 100 టికెట్లు మిగిలిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 22వ తేదీ వరకు పరిశీలిస్తే 4,400 టికెట్లు అందుబాటులో ఉంచితే 2,980 విక్రయం కాగా, 1420 మిగిలిపోయాయి. తాజాగా మంగళవారం కూడా 90 టికెట్లు విక్రయం కాగా, 110 టికెట్లు మిగిలిపోయాయి. మామూలుగానే శ్రీవాణి టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈక్రమంలో మిగిలిన టికెట్లను ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా కేటాయిస్తే మిగిలిన భక్తులు వినియోగించుకుంటారని, లేదా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు విపరీతమైన ఒత్తిడి నెలకొంటున్న సమయంలో సిఫార్సులపై కేటాయించినా ఈ టికెట్లు వృథా కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నడిరోడ్డుపై రైతుల పోరు..

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో..
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**బలగం టీవి, నాగర్ కర్నూల్**



అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే బేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రైతులు కదం తొక్కారు. బీఆర్ఎస్ నాయకత్వంలో నెల్లికొండ మార్కెట్ చౌరస్తా వద్ద వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించి భారీ రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అన్నదాతలకు ఈ దుస్థితి వచ్చిందని నినాదాలతో హోరెత్తించారు.

ముందుగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దవడాన్ని చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని మండిపడ్డారు.వర్షానికి తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

**స్తంభించిన ట్రాఫిక్:**

రైతుల రాస్తారోకోతో నెల్లికొండ చౌరస్తా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించాయి.

# తాగునీటి సమస్యతో రోడ్డెక్కిన భాగ్యనగర్ వాసులు

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన..
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**బలగం టీవి, సూర్యాపేట**



సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని భాగ్యనగర్‌లో నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానికులు బుధవారం రోడ్డెక్కారు. సూర్యాపేట––దంతాలపల్లి రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తూ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. నెల రోజులుగా తమ ఇండ్లకు మంచినీరు సరఫరా కాకపోవడంతో తాగునీటితో పాటు కనీస అవసరాలకే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారులకూ, ప్రజాప్రతినిధులకూ విన్నవించినప్పటికీ ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు.

"అన్నం లేకున్నా బతుకుతాం.. కానీ నీళ్లు లేకుండా ఎలా బతుకుతాం" అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉండటంతోనే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా కాలువల సమస్య కూడా తీవ్రంగా ఉందని, ఇండ్ల ముందు కాలువలు తీయించుకోవాలంటే డబ్బులు అడుగుతున్నారని వాపోయారు. కాలువలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తమ ప్రాంతంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న మహిళలను చెదరగొట్టారు.

# హెచ్‌పీసీఎల్ రీజనల్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ధర్నా




**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతను సృష్టించి, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చమురు కంపెనీలు అధిక లాభాలను గడిస్తున్నాయని సీపీఐ(ఎం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండదండలతోనే ఈ బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని విమర్శించింది. కృత్రిమ కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) రీజనల్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. దీనికి పార్టీ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం. వెంకటేశ్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి మాట్లాడుతూ.. బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ముగియగానే పెట్రో ధరలు పెంచేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసిందని విమర్శిం చారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగకపోయినా, కృత్రిమ కొరత చూపి అధిక ధరలకు విక్రయించేలా చమురు సంస్థలకు కేంద్రం సహకరిస్తోందని మండిపడ్డారు. గతంలోనూ బీహార్ తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే, అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున గ్యాస్ ధరలు పెంచి కానుకగా ఇచ్చారని ఎద్దేవా చేశారు.

సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి, రాష్ట్ర నాయకులు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించే అవకాశం ఉన్నప్పటికీ, అమెరికా ఆంక్షలకు భయపడి మోడీ ప్రభుత్వం భారతీయులపై భారం మోపుతోందని విమర్శించారు. పెట్రోల్ బంకుల యజమానులు ముందస్తుగా డబ్బులు చెల్లించినా, ఆయిల్ కంపెనీలు సరుకు సరఫరా చేయకుండా కావాలనే కొరత సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం. వెంకటేశ్ మాట్లాడుతూ నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూ లైన్లు కనిపిస్తున్నాయనీ, అనేక చోట్ల 'నో స్టాక్' బోర్డులు పెట్టి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. కేంద్రం వద్ద నిల్వలు నిండుగా ఉన్నాయని చెబుతూనే, క్షేత్రస్థాయిలో సరఫరా ఆపడం వెనుక కార్పొరేట్ శక్తుల లాభాలే పరమావధిగా ఉన్నాయని విమర్శించారు. ధర్నా అనంతరం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం హెచ్‌పీసీఎల్ రీజనల్ మేనేజర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు ఎం. మహేందర్, ఎ.పద్మ, ఎం.అజయ్ బాబు, నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె. నాగలక్ష్మి, నగర నాయకులు ఎం.శ్రీనివాస్ రావు, జి.నరేష్, జి.కిరణ్, ఎస్.మారన్న, టి.శేషగిరిరావు, ఎం.సత్యనారాయణ, ఎం.కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మేము చేయని ప్రజా పోరాటం లేదు

- మంత్రి పదవి కావాలని ఎప్పుడూ అడగలేదు
- ఎమ్మెల్సీ కోదండరాం
- ఘనంగా జన సమితి ఆవిర్భావ వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్**



రాష్ట్రంలో టీజేఎస్ పాల్గొనని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. రాజకీయా వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్‌కు మద్దతిచ్చాం. మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు.. నేను అడగలేదు. అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా ఉన్నాం. మే 12న జరిగే ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం అని అన్నారు. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు. అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా ఉండలేమని, ఈసారి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ముందు నుంచే నియోజక వర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.

# ముందున్నది మండుటెండల కాలం

- మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో భానుడు ప్రచండ భానుడిగా మారాడు. ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయటకు వస్తే మాడి మసైపోతారా అన్నట్లుగా ఎండలు దంచి కొడుతున్నాయి. మేలో మరింత తీవ్రంగా ఎండలు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. రోహిణి కార్తె రాకముందే నిప్పులు కురిపిస్తున్నాడు. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నా రాష్ట్రంలో పలుచోట్ల చండప్రచండగా ఎండలు మండుతున్నాయి. దీంతో ఉదయం 9గంటలు దాటిన తర్వాత బయటకు రావాలంటే జనం బెంబేలెత్తి పోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలుల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ప్రమాదస్థాయికి చేరినట్టు హెచ్చరించింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, 12 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది.

2016 ఏప్రిల్ 26న మంచిర్యాల జిల్లా దండేపల్లిలో నమోదైన 48.8 డిగ్రీల తర్వాత ఈ నెలలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని పేర్కొన్నది. దీంతో ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని వివరించింది. ప్రజలకు బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రతలు తీసుకోవాలని కోరింది. ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కరిసే అవకాశం ఉన్నదని తెలిపింది.

ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఢిల్లీతో సహా 21 రాష్ట్రాలకు జాతీయ మానవ హకుల కమిషన్ పలు కీలక సూచనలు చేసింది. వృద్ధులు, గర్భిణులు, పిల్లలతోపాటు ఉపాధిహామీ కూలీలపై ఈ ఎండల ప్రభావం అధికంగా ఉంటుందని హెచ్చరించింది. అలాంటి వారి రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరింది. 2019 నుంచి 2023 మధ్య కాలంలో వడదెబ్బ వల్ల 3,712 మంది మరణించినట్టు గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హీట్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి, బలహీనవర్గాలకు మంచినీరు, ఆశ్రయం, వైద్య సహాయం అందించాలని సూచించింది.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- **కరీంనగర్ మహిళా కాంగ్రెస్ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**


**బలగం టీవీ, కరీంనగర్**

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి గొప్ప ఆలోచనలతో సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవల్లి స్వర్ణ తొలిసారిగా కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గార్డెన్‌లో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మహిళలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లే సంకల్పంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా శక్తి తన విజయానికి బలమైందని గుర్తు చేసిన మంత్రి.. పార్టీ కోసం కష్టపడ్డ మహిళా కార్యకర్తలకు భవిష్యత్తులో చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవల్లి స్వర్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి మహిళా కార్యకర్త గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి..**

**బలగం టీవీ, ఎండపల్లి**

ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన భూసారపు భూమయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ బుధవారం ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. భూసారపు భూమయ్య – భూలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్ వివాహం అంజలితో కాగా మంత్రి లక్ష్మణ్ కుమార్ నూతన వధూవరులను ఈ సందర్భంగా ఆశీర్వదించారు.

## అన్నపూర్ణ రిజర్వాయర్ సందర్శన..

**బలగం టీవీ,ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే బుధవారం సందర్శించారు.రిజర్వాయర్ సామర్థ్యం, నీటి నిల్వ, తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అంతకముందు అనంతగిరి పోచమ్మ దేవాలయాన్ని కలెక్టర్, ఎస్పీ దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత, వివరాలను ఆలయ అధికారులను జిల్లా కలెక్టర్, ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీ కార్యదర్శికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు..



## కేసులపై సమగ్ర విచారణతో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు

- **ఆధునిక సాంకేతికతతో దొంగతనాల కేసులు ఛేదించాలి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నమోదైన ప్రతి కేసుపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, వారెంట్ల అమలు, సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు.

ఇప్పటివరకు నమోదైన కేసులతో పాటు పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ.. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో బాధితులకు న్యాయం జరిగేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని, కోర్టులు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

దొంగతనాల నివారణ, కేసుల ఛేదనలో ఆధునిక



సాంకేతికతను వినియోగించి రికవరీ శాతం పెంచాలని, బాధితుల సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి, వ్యాపారవేత్తల భాగస్వామ్యంతో విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పిల్లల రక్షణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. డ్రగ్స్ దుష్పరిణామాలు, పిల్లల భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గంజాయి రవాణాదారులతో పాటు వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో పెట్రోకార్, బ్లూ కోల్ట్ వాహనాల పాత్ర కీలకం..





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ వాహనాల కోసం నూతనంగా నిర్మించిన షెడ్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే. మంగళవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీస్ వాహనాల పార్కింగ్ మరియు సంరక్షణ కోసం నూతనంగా నిర్మించిన షెడ్‌ను జిల్లా ఎస్పీ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల కు కేటాయించిన పెట్రోకార్ వాహనాలను తనిఖీ చేసి వాహనాల నిర్వహణపై ఆరా తీసారు.

ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతు ....జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా నేర సమాచారం అందిన వెంటనే పోలీస్ బృందాలు బ్లూ కోల్ట్ మరియు పెట్రోకారు ద్వారా చేరుకొని క్షేత్ర స్థాయిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,ప్రజలకు రక్షణ కల్పిస్తున్నాయన్నారు. ప్రజలకు తలెత్తుతున్న సమస్యలకు తక్షణమే స్పందించి సత్వర సేవలు అందించేందుకు రాష్ట్ర పోలీస్ శాక నుండి కేటాయించబడిన పెట్రోకార్ ,బ్లూ కోల్ట్ వాహనాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలన్నారు. వాహనల డ్రైవర్లు వాహనాలను ఎప్పటికప్పుడు కండిషన్ లో ఉండేలా చూసుకోవాలని అప్పుడే ఘటన స్థలానికి సకాలంలో చేరే అవకాశం ఉంటుందన్నారు.అనంతరం అధికరులతో ఎస్పీ కలసి వాహనాల షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు,సి.ఐ లు ఆర్.ఐ లు వాహనాల డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో పోలీస్ అమరవీరుల స్మారక బ్యారక్ ప్రారంభం

- **అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి**
- **సీపీ గౌస్ అలాం**

**బలగం టీవీ, హుజూరాబాద్**

శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని పోలీస్ కమిషనర్ గౌస్ అలాం అన్నారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన 'పోలీస్ అమరవీరుల స్మారక బ్యారక్'ను బుధవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల గౌరవార్థం ఈ స్మారక బ్యారక్‌ను నిర్మించామని తెలిపారు. అత్యంత తక్కువ సమయంలో నాణ్యమైన వసతులతో భవనాన్ని పూర్తి చేశామని, ఇది పోలీస్ సిబ్బంది వసతి, సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో చొరవ చూపిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి, టౌన్ ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్లకు సొంత భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని సీపీ వెల్లడించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, స్థల సేకరణ ఇప్పటికే పూర్తైందని తెలిపారు. త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలతో కొత్త పోలీస్ భవనాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.



హుజూరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రస్తుతం హోంగార్డులతో తాత్కాలిక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనలు ప్రస్తుతం లేవని, కొత్త హైవే నిర్మాణం పూర్తయ్యాక ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, బొల్ల బత్తిని శ్రీనివాస్, రామకృష్ణ గౌడ్, హుజూరాబాద్ సబ్ డివిజన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాంపల్లి శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

- **లారీ-బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం**

**బలగం టీవీ, హైదరాబాద్**

సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాంపల్లి శివారులోని కరీంనగర్--సిరిసిల్ల ప్రధాన రహదారిపై వేగంగా వచ్చిన లారీ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు

**బలగం టీవీ, జగిత్యాల**

జగిత్యాల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు మంగళవారం సందర్శించారు. ధార్మిక సలహాదారు గోవిందహరితో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం కమిషనర్ శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి కమిషనర్‌కు శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నారాయణపూర్‌లో ఘనంగా పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణం, బోనాల వేడుకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణం, బోనాల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం పుట్టకు దని పోసి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా, రాత్రి నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మలకు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ యూత్ సంఘం సభ్యులు మహిళలకు ఒకే రంగులో 200 చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జెల్ల నాంపల్లి, ఉపాధ్యక్షుడు మామిండ్ల బాలనర్సయ్య పాల్గొన్నారు.

బుధవారం ఉదయం గ్రామంలోని అన్ని వీధుల గుండా పెద్దమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించారు. బోనాల సందర్భంగా బైండ్ల పూజారులు సంప్రదాయబద్ధంగా మేకపిల్లను గావుపట్టారు. గ్రామస్తుల కోసం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమంతో పాటు మంచినీటి సదుపాయం కల్పించారు. అనంతరం అమ్మవారి కళ్యాణం వైభవంగా నిర్వహించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. సిద్ధుల వేషధారణలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చివరగా సర్వగంప అమ్మవారి ఆలయం చుట్టూ తింపి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎలవేణి చంద్రం, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సాబేరా బేగం, సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## తంగళ్ళపల్లి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో భరోసా కేంద్రం అవగాహన సదస్సు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పిల్లల రక్షణ డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు భరోసా కేంద్రం ఎస్.ఐ వీనిత రెడ్డి ఆధ్వర్యంలో భరోసా సిబ్బంది మంగళవారం తంగళ్ళపల్లి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో విద్యార్థినిలకు భరోసా సేవలు,లింగ వివక్షత, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక దోపిడీ,,బాలలపై లైంగిక వేధింపులు, సైబర్ స్టాకింగ్, సైబర్ మోసాలు, సైబర్ సెక్యూరిటీ సైట్లు,బాలల హెల్ప్‌లైన్-1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ డయల్-1930 మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. మహిళ కానిస్టేబుల్స్ ప్రవళిక, శిరీష , భరోసా సెంటర్ సిబ్బంది మల్లీశ్వరి ,స్వాభావతి,పవనిత, పాల్గొన్నారు.





## పదో తరగతి ఫలితాల్లో సర్కారు బడి విద్యార్థుల ప్రభంజనం

- **ఎల్లారెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల అద్భుత ప్రతిభ.. 28 మందికి 500పైగా మార్కులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించి సర్కారు బడి గౌరవాన్ని మరింత పెంచారు.

పాఠశాలకు చెందిన ఎం. శ్రీజ 560, ఎం. రిషిక 560, బి. సంజన 551 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, మొత్తం 28 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుమల మనోహరాచారి మాట్లాడుతూ.. విద్యార్థుల కృషికి తోడు ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ, ప్రతిరోజూ నిర్వహించిన స్టడీ అవర్స్ ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేసిందన్నారు. తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ ఎనగందుల నర్సింలు, ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు గెంటే లత విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. పట్టుదలతో చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా అద్భుతాలు సృష్టించగలరని తమ విద్యార్థులు నిరూపించారని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

# తెలిదేవర భానుమూర్తి మృతి తీరని లోటు

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళిలిలి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ తెలిదేవర భానుమూర్తి మరణం తీరని లోటని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో నల్లగొండలో జైలు జీవితం గడిపిన భానుమూర్తి.. 1970ల నుంచే తెలంగాణ మాండలికంలో కవిత్వం, కథలు రచిస్తూ ప్రజల్లో ప్రాంతీయ అస్థిత్వ చైతన్యాన్ని రగిలించారని గుర్తు చేశారు.

తెలంగాణ యాసను సాహిత్య భాషగా నిలబెట్టడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. సీనియర్ జర్నలిస్టుగా తెలంగాణ సమస్యలపై ఆయన రాసిన వ్యాసాలు, కాలమ్స్ ఉద్యమ సమయంలో ప్రజలకు పోరాట ఆయుధాలుగా మారాయని కొనియాడారు. తెలిదేవర భానుమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మాజీ మంత్రి ఆకాంక్షించారు.

# హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు

● ముస్తాబాద్ హత్య కేసులో జిల్లా కోర్టు కీలక తీర్పు

**బలగం టీవి, ముస్తాబాద్**



ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ బుధవారం కీలక తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు.

**భూవివాదమే హత్యకు దారి**

ముస్తాబాద్ మండలం బద్నకల్ గ్రామానికి చెందిన కస్తూరి రాంరెడ్డి, కస్తూరి కరుణాకర్ రెడ్డి మధ్య వ్యవసాయ భూమి సరిహద్దుల విషయంలో తరచూ వివాదాలు నెలకొనేవి. ఈ కక్షను మనసులో పెట్టుకున్న కస్తూరి రాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కరుణాకర్ రెడ్డిని హత్య చేయాలని పథకం రచించాడు. 2020 డిసెంబర్ 27న కరుణాకర్ రెడ్డి పొలంలో పని చేస్తుండగా కస్తూరి రాంరెడ్డి, అతని భార్య మంజుల, కుమారులు వెంకటేశ్, మహేష్ కలిసి గొడ్డళ్లు, కట్టెలతో దాడి చేసి హత్య చేశారు. మృతుడి సోదరి పద్మ ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అప్పటి సీఐ ఉపేందర్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ దశలో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో పోలీస్ అధికారులు, కోర్టు మానిటరింగ్ బృందం సమన్వయంతో 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులు ఏ1 నుంచి ఏ4 వరకు దోషులుగా తేల్చి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.6 వేల జరిమానా విధించింది.

**నేరం చేస్తే శిక్ష తప్పదు : ఎస్పీ**

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.




# పదో తరగతి ఫలితాల్లో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అద్భుత ప్రతిభ

**ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 100% ఉత్తీర్ణత**

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఘన విజయాన్ని సాధించింది. పాఠశాల నుండి పరీక్షలకు హాజరైన 66 మంది విద్యార్థులు 66 మంది ఉత్తీర్ణులై 100% ఫలితాన్ని నమోదు చేయడం విశేషం. ఇందులో 53 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. అలాగే 580 పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు.

**టాప్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు:**

1. ఎ. అద్వీత -- 594 మార్కులు
2. కె. కీర్తిక -- 587 మార్కులు
3. ముజామిల్ పాషా -- 584 మార్కులు
4. పి. నందిని -- 582 మార్కులు

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజు రెడ్డి మాట్లాడుతూ, ఈ అద్భుత విజయాన్ని సాధించిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులకు, ఎల్లప్పుడూ అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి... ఆరుగురి అరెస్ట్

**నగదు, పేకాట ముక్కలు స్వాధీనం.. ఎస్సై వంశీకృష్ణ హెచ్చరిక**

**బలగం టీవి, గంగాధర**

గంగాధర మండల పరిధిలోని మధురానగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుండి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ శివారులో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం (లేదా ఈరోజు) దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను మంగపేట గ్రామానికి చెందిన మల్యాల కొమురయ్య, మహమ్మద్ జాకీర్ హుస్సేన్, బైరీ కార్తీక్ రెడ్డి, మల్యాల నర్సయ్యగా, అలాగే మధురానగర్‌కు చెందిన కుంచాల ఏడుకొండలు, ముద్రకోల తిరుపతిగా గుర్తించారు. నిందితుల వద్ద నుండి రూ. 15,590 నగదుతో పాటు పేకాట ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. "గ్రామాల్లో జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు. చట్టవిరుద్ధ పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం." అని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.



# నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**గూడ్స్ వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు.. డ్రైవర్ పరార్**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉప్పల్ పరిధిలోని నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన కృష్ణా (35), అతని భార్య మమిని (28) తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఆల్వాపురి నుంచి సికింద్రాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

నాగోల్ మెట్రో స్టేషన్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన మహీంద్రా మినీ ట్రాన్స్‌పోర్ట్ గూడ్స్ వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మమినికి కుడిచేతికి ఫ్రాక్చర్ కాగా, కుడికాలు మోకాలి వద్ద తీవ్ర గాయాలయ్యాయి. భర్త కృష్ణా, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం గూడ్స్ వాహనం డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మమినికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కృష్ణా నాగోల్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తుండగా, మమిని దేవాలయంలో పనిచేస్తోంది. బంధువులను కలిసేందుకు సికింద్రాబాద్‌కు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

**బలగం టీవీ, వేములవాడ :**

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండల పరిధిలోని జయవరం, మల్లారం, హనుమాజీపేట, మరియు బాలరాజుపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఒక్కో ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేసిన వారికీ ఆది శ్రీనివాస్, వారికి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గూడు లేని పేదలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తున్నామని, నిరాశ్రయులు నేడు సొంత ఇంటి యజమానులుగా మారడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లను



మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గృహ ప్రవేశ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి..

● కలెక్టర్ గరిమ అగ్రవాల్




**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు వినూత్న రీతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ క్రైమ్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బుధవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పోలీస్, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. , అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 12 వరకు వివిధ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా ఫోన్ ద్వారా వచ్చే ఓటీపీలు, బ్యాంక్ వివరాలు మరియు తెలియని ఏపీకే ఫైల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 87126 56425 (షీ టీమ్స్), 14416 (టెలీ మానస్) వంటి అత్యవసర నంబర్లను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు . అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఎత్తు, బరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఎదుగుదల లోపం ఉన్నవారికి ప్రత్యేక వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 'డిజిటల్ అరెస్ట్' కేసులు నమోదు కాలేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దని, అకౌంట్ సెట్టింగ్స్‌ను 'ప్రైవేట్'లో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని అన్నారు.. ఇటీవల హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టాలను గుర్తు చేస్తూ, ట్రాఫిక్ నిబంధనల పాటించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామంలోని రోడ్ సేఫ్టీ కమిటీలు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ గన్నారం వసంత తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

● సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

నేడు (ప్రకటించిన) పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భారత విద్యా నిలయం సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా బి. మేఘారెడ్డి 571/600 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలవగా, సీహెచ్ సందీప్ 563/600 మార్కులతో ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటారు. మొత్తం 80 శాతం మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల నిర్వాహకులు అభినందించారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్, బి. భాస్కర్ రెడ్డి, కరస్పాండెంట్ రాకేష్, డైరెక్టర్ చంద్రకాంత్ గౌడ్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.










# ఢిల్లీ హైకోర్టు వర్చువల్ విచారణలో కలకలం




**బలగం టీవి, న్యూఢిల్లీ**

దేశ అత్యున్నత న్యాయస్థానాల కార్యకలాపాల్లో భారీ భద్రతా లోపం చోటుచేసుకుంది. ఢిల్లీ హైకోర్టులో వర్చువల్ (ఆన్‌లైన్) పద్ధతిలో విచారణ జరుగుతుండగా, ఒక్కసారిగా స్క్రీన్‌పై అసభ్యకరమైన (పోర్నోగ్రాఫిక్) వీడియోలు ప్రత్యక్షం కావడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు విస్తుపోయారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతుండగా ఈ ఘటన జరిగింది.

కోర్టు వర్గాల సమాచారం ప్రకారం.. విచారణ సమయంలో ఒక గుర్తుతెలియని

**స్క్రీన్‌పై అసభ్య వీడియోలు**

**నివ్వెరపోయిన ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం..**

**పోలీసులకు ఫిర్యాదు**

వినియోగదారుడు అసభ్య వీడియోను పదే పదే ప్లే చేశాడు. దీనిని గమనించిన అధికారులు వెంటనే వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థను నిలిపివేశారు. అయితే, ఈ అంతరాయం కేవలం ప్రధాన న్యాయమూర్తి కోర్టుకే పరిమితం కాలేదని, మరికొన్ని కోర్టు గదుల్లో కూడా ఇలాంటి సంఘటనలే జరిగినట్లు అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ ఘటనపై హైకోర్టు పరిపాలనా విభాగం ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం లిలి'ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ కు ఫిర్యాదు చేసింది. ప్రాథమిక విచారణలో శ్రీధర్ సర్నోబాత్, షితిజిత్ సింగ్ అనే ఇద్దరు కక్షిదారుల ఖాతాల నుండి ఈ వీడియోలు స్ట్రీమ్ అయినట్లు గుర్తించారు. కాగా, తన ఖాతాను అమెరికా నుండి ఎవరో హ్యాక్ చేశారని, తనకు ఈ విషయంతో సంబంధం లేదని షితిజిత్ సింగ్ పోలీసులకు తెలిపారు.

ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి తీవ్రంగా స్పందించారు. "కోర్టు నిబంధనల ప్రకారం రికార్డు చేసిన కంటెంట్‌ను మాత్రమే ప్రదర్శించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రిజిస్ట్రార్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేశాం" అని సిజె పేర్కొన్నారు. కోర్టు కార్యకలాపాలను రికార్డ్ చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఈ దృశ్యాలను రికార్డ్ చేసినా లేదా ప్రచారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఐఎఫ్ఎస్ఓ బృందం అత్యాధునిక ఫోరెన్సిక్ సాంకేతికతతో ఈ సైబర్ దాడి వెనుక ఉన్న అసలు సూత్రధారులను కనిపెట్టే పనిలో ఉంది.

# ఏపీలో ఎండలు, వర్షాల ద్వంద్వ ప్రభావం

**కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు.. మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో వర్షాలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు, మరికొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది.

బుధవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 20 మండలాల్లో సాధారణ వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపింది.

ద్రోణి ప్రభావంతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే రాయలసీమ, ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది.

ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద నిలవవద్దని హెచ్చరించింది. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

# ముంబై కోటలో 'సన్ రైజర్స్' గర్జన..

- 244 పరుగుల లక్ష్యం చిత్తు!
- హెడ్, అభిషేక్ విధ్వంసం..
- క్లాసెన్, సలీల్ అరోరా మెరుపులు
- ముంబై ఇండియన్స్‌పై 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ విజయం



**బలగం టీవీ, ముంబై**

ఐపీఎల్‌లో పరుగుల సునామీ కొనసాగుతోంది. వాంఖడే స్టేడియం సాక్షిగా సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి అసాధారణ పోరాట పటిమను కనబరిచింది. ముంబై ఇండియన్స్ నిర్దేశించిన 244 పరుగుల భారీ లక్ష్యాన్ని 'ఆరెంజ్ ఆర్మీ' కేవలం 18.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు ఆరంభించిన విధ్వంసాన్ని, హెన్రిచ్ క్లాసెన్, యువ సంచలనం సలీల్ అరోరా పూర్తి చేసి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

244 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా లిలిట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 76; 5 ఫోర్లు, 8 సిక్సర్లు)లిలి ముంబై బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. అతనికి జతగా లిలిఅభిషేక్ శర్మ (24 బంతుల్లో 45)లిలి రెచ్చిపోవడంతో తొలి వికెట్‌కు కేవలం 52 బంతుల్లోనే 129 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు బోర్డు బుల్లెట్ వేగంతో పరుగులు పెట్టింది.

ఓపెనర్లు వెనుదిరిగాక ఇషాన్ కిషన్ (0) విఫలమవడంతో సన్‌రైజర్స్ కాస్త ఒత్తిడికి లోనైంది. అయితే, క్రీజులోకి వచ్చిన లిలిహెన్రిచ్ క్లాసెన్ (30 బంతుల్లో 65 నాటౌట్)లిలి తన అనుభవాన్నంతా ఉపయోగించి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. నితీశ్ రెడ్డి (21) అతనికి సహకారం అందించాడు.

చివరి ఓవర్లలో యువ బ్యాటర్ సలీల్ అరోరా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 10 బంతుల్లోనే 1 ఫోర్, 3 సిక్సర్లతో 30 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించాడు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా వేసిన 19వ ఓవర్లో సలీల్ బాదిన సిక్సర్లు మ్యాచ్‌ను ఏకపక్షం చేశాయి. దీంతో 8 బంతులు మిగిలి ఉండగానే ఎస్ఆర్‌హెచ్ విజయం సాధించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఓపెనర్ లిలిరియాన్ రికెల్టన్ (55 బంతుల్లో 123 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్సర్లు)లిలి వీరోచిత శతకంతో చెలరేగాడు. విల్ జాక్స్ (46), హార్దిక్ పాండ్యా (31) మెరిసినా.. బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకోవడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

**స్కోరు వివరాలు:**

ముంబై ఇండియన్స్: 243/5 (20 ఓవర్లు) - రికెల్టన్ 123లి, విల్ జాక్స్ 46.

సన్‌రైజర్స్ హైదరాబాద్: 245/4 (18.4 ఓవర్లు) - హెడ్ 76, క్లాసెన్ 65లి, అభిషేక్ 45, సలీల్ 30 .




## శ్రీలంక బోర్డు ప్యానెల్ మొత్తం రాజీనామా!

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

శ్రీలంక క్రికెట్ బోర్డులో పెను సంచలనం జరిగింది. బోర్డు ప్రెసిడెంట్ షమ్మి సిల్వ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. అయితే ఆయనతోపాటు ఎగ్జిక్యూటివ్ కమినీ మొత్తం సామూహికంగా రాజీనామా సమర్పించం క్రీడా వర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది. షమ్మి తన రాజీనామా విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే, క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమగేకు అధికారికంగా సమాచారం అందించారు. అయితే ఒకేసారి ఇంత మంది పదవి నుంచి తప్పుకోవడానికి గల కారణాలు మాత్రం బోర్డు వెల్లడించలేదు. అయితే బోర్డులో ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, అధ్యక్షుడు దిస్సనాయకే రీసెంట్?గా బోర్డు సభ్యులతో చర్చలు జరిపారు. సుమారు మూడు గంటలపాటు ఈ చర్చలు కొనసాగాయి. కార్యనిర్వాహక కమిటీ చర్చల అనంతరం సిల్వా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే, రాజీనామాకు గల కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే సిల్వపై అనేక ఆర్థిక అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై ఆటగాళ్లు సైతం ఆరోపణలు చేశారు. దీంతోపాటుగా గత కొంతకాలంగా ఇంటర్నేషనల్ లెవెల్?లో శ్రీలంక జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ క్రమంలోనే బోర్డులోని పరిస్థితులను అక్కడి ప్రభుత్వం కొంతకాలంగా క్షుణ్ణంగా గమనిస్తూ వస్తుంది. ఈ క్రమంలో గతనెల నుంచి సిల్వాను తొలగించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తూ వచ్చింది. తాజాగా ఆయనే స్వయంగా పదవి నుంచి వైదొలిగారు. కాగా, సిల్వతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్ల రాజీనామాలను ఆమోదించినట్లు క్రీడా శాఖ మంత్రి సునీల్ ధ్రువీకరించారు. అలాగే శ్రీలంక క్రికెట్‌లో నెలకొన్న ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి, నిర్మాణాత్మక సంస్కరణలను అమలు చేయడానికి త్వరలోనే ఒక తాత్కాలిక కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు. మరి తదుపరి ఈ బాధ్యతలు ఎవరు చేపడతాని ఆసక్తిగా మారింది. అయితే సిల్వాతో పాటు కార్యనిర్వాహక కమిటీ రాజీనామా చేసిన నేపథ్యంలో, బోర్డు నియంత్రణను తమ ఆధీనంలోకి తీసుకోవాలని శ్రీలంక ప్రభుత్వం నిర్ణయించింది. '1973 క్రీడా చట్టంలోని సెక్షన్లు 31, 34 ప్రకారం 'శ్రీలంక క్రికెట్'కు సంబంధించిన సమస్త పరిపాలనా విధులు తాత్కాలికంగా క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోకి తీసుకోనున్నాం' అని క్రీడా శాఖ మంత్రి సునీల్ కుమార గమగే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఐసీసీ నిబంధనల ప్రకారం దేశ క్రికెట్ బోర్డు పాలనాపరమైన విధానాల్లో రాజకీయాల జోక్యం ఉండకూడదు. మరి దీనిపై లంక ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో అనేది చూడాలి! కాగా, షమ్మి సిల్వ ఏడేళ్లుగా లంక బోర్డు అధ్యక్షుడిగా కొనసాగుతూ వచ్చారు. ఆయన 2019లో తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2021, 2023, 2025లో ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. అయితే ఈ ఏడాది శ్రీలంక క్రికెట్ జట్టు కీలక పర్యటనలకు వెళ్లనుంది. ఆయా జట్లతో టీ20, వన్డే, టెస్టు సిరీస్?లు ఆడాల్సి ఉంది. ఈ జూన్?లో వెస్టిండీస్? పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో ఆతిథ్య విండీస్?తో లంక జట్టు మూడేసి టీ20, వన్డే మ్యాచ్?లు ఆడుతుంది. అలాగే 2 మ్యాచ్?ల టెస్టు సిరీస్ ఆడనుంది. జూన్ 03న ప్రారంభమై, జులై 07 దాకా ఈ పర్యటన కొనసాగనుంది. ఇక సెప్టెంబర్?లో ఇంగ్లాండ్?కు పయనమవ్వాల్సి ఉంది. ఈ టూర్?లో మూడు టీ20, మూడు వన్డే మ్యాచ్?ల సిరీస్?లు ఆడుతుంది. ఆ తర్వాత డిసెంబర్?లో భారత్? పర్యటనకు రావాల్సి ఉంది. ఇక్కడ లంక జట్టు టీమ్ఇండియాతో మూడు టీ20, మూడు వన్డే మ్యాచ్?ల సిరీస్?లో పోటీ పడనుంది. డిసెంబర్ 13న ఈ పర్యటన ప్రారంభం కానుంది. మొదట వన్డే సిరీస్? ఉండనుంది. ఆ తర్వాత టీ20 సిరీస్? ఉంటుంది.

# ఆసియా క్రీడలకు భారత సెలెక్టర్లు కసరత్తులు

**బలగం టీవీ, ముంబై**



జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడల కోసం భారత సెలెక్టర్లు కసరత్తులు ప్రారంభించారు. ప్రధాన జట్టు అంతర్జాతీయ సిరీస్‌లలో బిజీగా ఉండటంతో, ఈ మెగా టోర్నీకి యువ ఆటగాళ్లతో కూడిన జట్టును పంపనున్నారు. తాజా నివేదికల ప్రకారం, టీమ్ ఇండియా కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్, వైస్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026లో వీరిద్దరూ ప్రదర్శించిన నాయకత్వ పటిమ, బ్యాటింగ్ నైపుణ్యం సెలెక్టర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.భారత జట్టు నాయకత్వ బాధ్యతలకు శ్రేయాస్ అయ్యర్ అత్యంత అనువైన వ్యక్తిగా కనిపిస్తున్నారు. దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో కోల్‌కతా వంటి జట్లను విజయవంతంగా నడిపించిన అనుభవం అతనికి ఉంది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం అయ్యర్ ప్రత్యేకత. యువ క్రీడాకారులకు దిశానిర్దేశం చేస్తూ, జట్టును ఐక్యంగా ఉంచగల సామర్థ్యం అతనికి అదనపు బలం. అనుభవం, స్థిరత్వం ప్రాతిపదికన సెలెక్టర్లు అయ్యర్ వైపు మొగ్గు చూపుతున్నారు.మరోవైపు, ఇషాన్ కిషన్ తన దూకుడైన ఆటతీరుతో, నాయకత్వ లక్షణాలతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలిక సారథిగా వ్యవహరించినప్పుడు అతను తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు ప్రశంసలు పొందాయి. వికెట్ కీపింగ్ చేస్తూ మైదానాన్ని అంచనా వేయడంలో కిషన్ దిట్ట. జట్టులో ఉత్సాహాన్ని నింపుతూ, కీలక సమయాల్లో ఫలితాలను రాబట్టగల సత్తా ఉన్నందున అతన్ని ఉప-నాయకుడిగా ఎంపిక చేసే అవకాశం ఉంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించడమే లక్ష్యంగా బీసీసీఐ ప్రణాళికలు రచిస్తోంది. జపాన్ వేదికగా జరిగే ఈ టోర్నీలో యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటుకునేందుకు ఇది ఒక గొప్ప వేదిక. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రతిభావంతులైన ఆటగాళ్లతో ఈ జట్టును నిర్మించనున్నారు. అధికారిక ప్రకటన ఇంకా రానప్పటికీ, అయ్యర్, కిషన్ ద్వయం భారత జట్టును విజయపథంలో నడిపిస్తారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తు భారత క్రికెట్ నాయకత్వాన్ని సిద్ధం చేసే దిశగా ఇది ఒక కీలక అడుగు కానుంది.

# మూడవసారి టీ20 ప్రపంచకప్ విజేతపై భారత్ కన్ను

**బలగం టీవీ, ముంబై**

ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టు కూడా వరుసగా మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలవలేదు. ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకునేందుకు భారత సెలెక్టర్లు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఐపీఎల్ 2026లో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న కుర్రాళ్లను గుర్తించి, వారికి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాలని బోర్డు నిర్ణయించింది. అనుభవం, యవ్వనం కలగలిసిన జట్టుతో ఆస్ట్రేలియా గడ్డపై సత్తా చాటాలని భారత్ భావిస్తోంది. 2028 ప్రపంచకప్ జట్టులో 2026 విజేత జట్టులోని కీలక సభ్యులు కొనసాగే అవకాశం ఉంది. సంజు శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లు తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. వీరికి తోడుగా బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ వంటి స్టార్ బౌలర్లు జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. వీరి అనుభవం జట్టుకు ఎంతో కీలకం కానుంది.ఈసారి జట్టులోకి కొంతమంది సరికొత్త ఆటగాళ్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రజత్ పాటిదార్, హర్షిత్ రాణాలకు మొదటిసారి ప్రపంచకప్ ఆడే అవకాశం లభించవచ్చు. 2026లో గాయం కారణంగా దూరమైన హర్షిత్ రాణా, ఈసారి తన సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నాడు. ఐపీఎల్ 2026లో వీరి ప్రదర్శన సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది.2028 టీ20 ప్రపంచకప్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో సంయుక్తంగా జరగనుంది. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 19 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు. గతంలో 2022లో ఆస్ట్రేలియా ఒంటరిగా ఆతిథ్యం ఇవ్వగా, ఈసారి కివీ కూడా జతకట్టింది. అక్కడి పిచ్‌లు వేగంగా ఉంటాయని, అందుకే పేస్ బౌలింగ్‌కు అనుకూలించే ఆటగాళ్లను ఎంపిక చేయడంపై బోర్డు దృష్టి పెట్టింది. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ఫాంతో అంతగా లేదు. తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. ఈ క్రమంలో బీసీసీఐ మిస్టర్ 360 ప్లేయర్ ను తప్పించాలని చూస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, ఐపీఎల్ 2026లో దంచికొడుతోన్న శ్రేయాస్ అయ్యర్ ఈ ప్లేస్ లో వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ గా రీఎంట్రీ ఇవ్వొచ్చని తెలుస్తోంది.



## కాంబ్లీ యాడ్‌పై దుమారం..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

గత ఏడాది కాలంగా వినోద్ కాంబ్లీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొంది, మృత్యువు అంచు దాకా వెళ్లి వచ్చిన ఆయన, ఇటీవల ఒక ఐస్‌క్రీమ్ బ్రాండ్ ప్రచారంలో కనిపించారు. ఈ ప్రకటనలో ఆయన తన పాత క్రికెట్ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కొన్న తీరును చూపించారు. "జీవితంలో తక్కువ పొందిన వారు, మరికొంచెం ఎక్కువ పొందడానికి అర్హులు" అనే నినాదంతో ఈ ప్రచార చిత్రాన్ని రూపొందించారు. ఈ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో విడుదలైన వెంటనే నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వచ్చాయి. ముఖ్యంగా కాంబ్లీ వంటి దిగ్గజ ఆటగాడి కష్టాలను, ఆయన వ్యక్తిగత బలహీనతలను ఒక వస్తువు అమ్మకానికి వాడుకోవడంపై చాలా మంది మండిపడుతున్నారు. ఒక వ్యక్తి భావోద్వేగ పూరితమైన కమ్‌బ్యాక్‌ను వ్యాపార కోణంలో చూడటం ఏమాత్రం సబబు కాదని వారు వాదిస్తున్నారు. ప్రస్తుత కాలంలో బ్రాండ్‌లు తమ వస్తువులను ప్రచారం చేయడానికి సెలబ్రిటీల నిజ జీవిత కథలను ఎంచుకోవడం సర్వసాధారణం. అయితే కాంబ్లీ విషయంలో ఇది పరిధి దాటిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న ఒక మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడిని ఇలాంటి ప్రకటనల్లో చూపించడం ఆయనను అవమానించడమేనని అభిమానులు పేర్కొంటున్నారు. "ఆయనకు గౌరవం ఇవ్వాల్సింది పోయి, ఐస్‌క్రీమ్ అమ్మడానికి వాడుకుంటారా?" అంటూ ఎక్స్ వేదికగా పలువురు ప్రశ్నిస్తున్నారు.వినోద్ కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఆయన ఎంచుకునే దారిపై చర్చ జరుగుతోంది. ఐపీఎల్ వంటి భారీ వేదికలు ఉన్న తరుణంలో, ఒక గొప్ప ఆటగాడికి తగిన గౌరవం దక్కేలా చూడాల్సిన బాధ్యత క్రికెట్ బోర్డుపై కూడా ఉందని కొందరు సూచిస్తున్నారు. ఏది ఏమైనా, ఈ ఐస్‌క్రీమ్ ప్రకటన మాత్రం ప్రస్తుతం భారత క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## జడేజా ఇంట ముదిరిన విభేదాలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



టీమిండియా స్టార్ క్రికెటర్ రవీంద్ర జడేజా కుటుంబంలో రాజకీయ సెగలు మరోసారి రాజుకున్నాయి. గుజరాత్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు జడేజా సోదరి, భార్య మధ్య ఉన్న విభేదాలను మళ్లీ తెరపైకి తెచ్చాయి. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వార్డ్ నెం-2 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జడేజా సోదరి నైనాబా జడేజా పరాజయం పాలయ్యారు. ఆ పరాజయంతో రవీంద్ర జడేజా ఇంట్లో రాజకీయంగా భార్య రివాబా జడేజాదే ఆధిపత్యం అని మరోసారి నిరూపితమైంది. ప్రస్తుతం జడేజా భార్య రివాబా జడేజా గుజరాత్ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగారు. జామ్‌నగర్ నార్త్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమె.. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే జడేజా సోదరి నైనాబా మాత్రం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వదినకు పూర్తి వ్యతిరేక దిశలో పయనిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. రివాబా జడేజాకు వ్యతిరేకంగా నైనాబా కాంగ్రెస్ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.జడేజా క్రికెట్ కెరీర్‌లో నైనాబా జడేజా పాత్ర ఎంతో కీలకమైనది. తల్లి మరణం తర్వాత జడేజాను ఓ తల్లిలా పెంచి పెద్ద చేయడమే కాకుండా క్రికెటర్‌గా ఎదగడానికి ఆమె ఎంతో కష్టపడ్డారు. ఈ విషయాన్ని రవీంద్ర జడేజా కూడా పలు సందర్భాల్లో గుర్తు చేసుకున్నాడు. కానీ రాజకీయాల విషయానికి వచ్చేసరికి జడేజా తన భార్య రివాబాకు మద్దతుగా నిలుస్తున్నాడు. ఇది సోదరి నైనాబాకు రుచించడం లేదు. ఇటీవల రివాబా మంత్రి హోదాలో రాజ్‌కోట్ సందర్శనకు వచ్చినప్పుడు కూడా నైనాబా ఆమెపై విమర్శలు గుప్పించడం వీరి మధ్య ఉన్న గ్యాప్‌ను స్పష్టం చేస్తోంది. ఓ వైపు కుటుంబంలో ఈ రాజకీయ రచ్చ కొనసాగుతుండగా.. రవీంద్ర జడేజా ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సీజన్‌కు ముందు అనూహ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ నుంచి రాజస్థాన్ రాయల్స్‌కు ట్రేడ్ అయిన జడేజా.. మైదానంలో తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 132 పరుగులు చేయడంతో పాటు 6 వికెట్లు పడగొట్టాడు. మైదానంలో ఆల్ రౌండ్ షో చూపిస్తున్నప్పటికీ, ఇంటి వద్ద సోదరి ఓటమి, కుటుంబ సభ్యుల మధ్య రాజకీయ వైరం జడేజాను కొంత ఇబ్బందికి గురిచేసే అంశాలేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఈ-సిగరేట్ తాగుతూ కెమెరాకి దొరికిన రియాన్ పరాగ్..!

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో అదిరిపోయే విజయాలతో దూసుకుపోతున్న రాజస్థాన్ రాయల్స్ టీమ్.. పంజాబ్ కింగ్స్ విజయాల పరంపరకు బ్రేక్ వేసి పాయింట్ల పట్టికలో తన సత్తా చాటింది. అయితే ఈ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. అయితే రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ జరుగుతుండగా డ్రెస్సింగ్ రూమ్‌లో రియాన్ పరాగ్ వేపింగ్ (ఈ-సిగరేట్) చేస్తూ కనిపించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ పక్కన ఉండగానే పరాగ్ ఈ-సిగరేట్ తాగుతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అధికృత ప్రాంతాలు మినహా.. ఛేజింగ్ రూమ్‌లలో లేదా మైదానాల్లో ధూమపానంకు అనుమతి లేదు. అదే సమయంలో 2019 నుంచి భారత్‌లో ఈ సిగరేట్ల విక్రయం, వాడకం పైనా నిషేదం ఉంది. ఒకవేళ పరాగ్ ఇ-సిగరేట్ తాగాడని తేలితే మాత్రం భారతదేశం ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం 2019 కింద అతడికి శిక్ష పడే అవకాశం ఉందని అంటున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, భారీ జరిమానా విధించబడతాయి. అంతేకాకుండా బీసీసీఐ కూడా అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో ఆర్ఆర్ 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇదే తొలి ఓటమి. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో మార్కస్ స్టోయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59; 44 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) లు హాఫ్ సెంచరీలు చేశారు. కూపర్ కొన్నోలీ (30; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (29; 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు తీశాడు. జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 223 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆర్ఆర్ బ్యాటర్లలో డోనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (51; 27 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ (43 ; 16 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు), శుభమ్ దూబే (31 నాటౌట్; 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ మూడు, అర్ష్‌దీప్ సింగ్ ఓ వికెట్ పడగొట్టాడు.



## సూర్యవంశీపై గవాస్కర్ ప్రశంసల వర్షం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 16 బంతుల్లో 5 సిక్సర్లు, 3 ఫోర్లతో 43 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ.. ఈ సీజన్లో 400 పరుగుల మైలురాయిని అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో కేవలం 167 బంతుల్లోనే 400 పరుగులు పూర్తి చేసి.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా (238.09 స్ట్రైక్ రేట్‌తో) ఈ ఘనత సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు.యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్న తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. "వైభవ్ కొడుతున్న షాట్లు అద్భుతం. అతని కోసం బౌండరీ లైన్ వద్ద 10 మంది ఫీల్డర్లను పెట్టినా ఆపడం అసాధ్యం. అతను దేనికీ భయపడటం లేదు. ఇంత చిన్న వయసులో ఉండటం వల్ల వచ్చే ప్రయోజనం అదే కాబోలు. ఎదురుగా ఉన్నది ఏ బౌలర్ లేదా ఏ జట్టు అని అతను ఆలోచించడం లేదు, కేవలం బంతిని మాత్రమే చూస్తున్నాడు" అని కొనియాడారు. వైభవ్ దూకుడు ఐపీఎల్‌లోని మిగిలిన జట్లకు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో వైభవ్ సూర్యవంశీ ఇచ్చిన ఆరంభం ఎంతో కీలకంగా మారింది. పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్‌లోనే 6, 4, 4 బాది వైభవ్ సూర్యవంశీ తన ఉద్దేశాన్ని చాటాడు. లాకీ ఫెర్గూసన్, మార్కో జాన్సెన్ వంటి మేటి బౌలర్లను కూడా లెక్కచేయకుండా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 3.2 ఓవర్లలోనే రాజస్థాన్ 50 పరుగుల మార్కును దాటడం వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసానికి నిదర్శనం.చివరికి డోనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే అద్భుతమైన పోరాటంతో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యశస్వి జైస్వాల్ (51), రియాన్ పరాగ్ (29) కూడా రాణించడంతో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ మొదటి ఓటమిని చవిచూసింది. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 ఏళ్ల వయసులోనే దిగ్గజాల ప్రశంసలు అందుకోవడమే కాకుండా, పరుగుల వేటలో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం.

## ఆ 'ఏఐ చిప్'ని దేవుడే నా బ్యాట్‌లో ఫిక్స్ చేశాడు : వైభవ్ సూర్యవంశీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది అసాధారణ ఫామ్‌లో ఉన్నాడు. 9 మ్యాచ్‌ల్లోనే 400 పరుగులు సాధించి ప్రస్తుతం 'ఆరెంజ్ క్యాప్' రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ముఖ్యంగా 238.09 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ జస్ప్రీత్ బుమ్రా, జోష్ హేజిల్‌వుడ్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్‌ను చీల్చి చెండాడుతున్నాడు. ఈ క్రమంలోనే ఐపీఎల్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో (167 బంతులు) 400 పరుగుల మైలురాయిని అందుకున్న ఆటగాడిగా వైభవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. వైభవ్ ఆడుతున్న అద్భుతమైన షాట్లను చూసి పాకిస్థాన్ క్రికెట్ విశ్లేషకుడు నౌమాన్ నియాజ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. వైభవ్ బ్యాటింగ్‌ను చూస్తుంటే అతనిలో ఏదో మ్యాజిక్ ఉందని, బహుశా అతని శరీరంలో లేదా బ్యాట్‌లో 'కృత్రిమ మేధస్సు' (ఏఐ) చిప్ అమర్చి ఉండవచ్చని సరదాగా వ్యాఖ్యానించాడు. "ఈ అబ్బాయి అసాధారణంగా ఆడుతున్నాడు. డోపింగ్ పరీక్షలు చేసినట్లే, ఇతనిని ఏదైనా ప్రయోగశాలకు పంపి పరీక్షించాలి. బహుశా శరీరంలో ఏఐ చిప్ ఉందేమో" అని నియాజ్ పేర్కొన్నాడు. 18 ఏళ్లు నిండకముందే ఇంతటి శక్తివంతమైన షాట్లు ఆడటం అసాధ్యమని ఆయన కొనియాడాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 16 బంతుల్లో 43 పరుగులు చేసిన తర్వాత, నౌమాన్ నియాజ్ చేసిన ఈ 'ఏఐ చిప్' వ్యాఖ్యలపై వైభవ్ స్పందించాడు. దీనికి అతను నవ్వుతూ సమాధానమిస్తూ.. "ఆ చిప్‌ను దేవుడే స్వయంగా నా బ్యాట్‌కు అమర్చి పంపాడు. నేను పుట్టకముందే పైనున్న దేవుడు నా బ్యాట్‌లో ఏదో ఒక శక్తిని పెడుతున్నానని చెప్పాడు, ప్రస్తుతం నేను దాన్నే వాడుతున్నాను" అని బదులిచ్చాడు. ఈ సమాధానం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ సీజన్‌లో వైభవ్ కేవలం 167 బంతుల్లోనే 400 పరుగులు పూర్తి చేసి, గతంలో ఆండ్రీ రసెల్ (188 బంతులు), అభిషేక్ శర్మ (195 బంతులు) పేరిట ఉన్న రికార్డులను తిరగరాశాడు. 15 ఏళ్ల వయసులో పరిణతి చెందిన ఆటతీరును ప్రదర్శిస్తున్న వైభవ్, భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణంగా మారుతున్నాడు.

# పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక



పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


# వారణాసికి ప్రపంచ మార్కెట్



## పక్కా ప్రణాళికతో చిత్ర బృందం అడుగులు

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు. రాజమౌళి వీడియో సందేశంతోపాటు, 'వారణాసి' తెరవెనక సన్నివేశాల్ని అందులో ప్రదర్శించారు. తదుపరి బ్రెజిల్‌తోపాటు మరిన్ని దేశాల్లోనూ 'వారణాసి' సినిమాని ప్రచారం చేయనున్నట్టు తెలుస్తోంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఓ పాటని తెరకెక్కించారు. మే తొలి వారం నుంచి హైదరాబాద్‌లోనే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. కథానాయకుడు మహేశ్ ఇతర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బన్సాలీ సినిమాలో రామ్‌చరణ్ బదులు..ధనుష్



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తన సినిమాల ద్వారా విజువల్ గ్రాండియర్‌కు కొత్త అర్థం తీసుకొచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఆయన తెరకెక్కించే ప్రతి చిత్రం విజువల్ వండర్‌గా నిలుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో భన్సాలీ ప్రొడక్షన్స్ నుంచి రాబోతున్న మరో భారీ ప్రాజెక్ట్ ఇప్పుడు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ బ్జడెట్‌తో రూపొందనున్న ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామాను పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో మిత్రన్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. అడవి నేపథ్యంలో సాగే పౌరాణిక గాథను అత్యాధునిక సాంకేతికతతో, భన్సాలీ స్టైల్ గ్రాండియర్‌తో తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మొదట మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేరును పరిశీలించినట్లు సమాచారం. ఈ పాత్రకు ఆయన సరిపోతారని భావించినప్పటికీ, పలు కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆయన చేతిలోకి రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అవకాశం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌ని వరించిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ధనుష్ తన విభిన్నమైన పాత్రల ఎంపికతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ వస్తున్నాడు. ప్రత్యేకంగా కంటెంట్ ఆధారిత సినిమాల్లో తనదైన ముద్ర వేసిన ఆయనకు ఈ మైథోలాజికల్ పాత్ర మరో మైలురాయిగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పాత్రకు అవసరమైన నటన, యాక్షన్, భావోద్వేగాలను సమర్థంగా ప్రదర్శించగల సామర్థ్యం ధనుష్‌లో ఉందనే నమ్మకంతోనే భన్సాలీ టీమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాక్. ఈ సినిమా కథాంశం పురాణ కాలం నేపథ్యంలో అడవిలో జరిగే సంఘటనల చుట్టూ తిరుగుతుందని సమాచారం. గ్రాండియర్ విజువల్స్, శక్తివంతమైన కథనం, సాంకేతిక నైపుణ్యంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామ్ చరణ్ నుంచి ధనుష్ చేతికి వెళ్లిన ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇటు దక్షిణాది, అటు బాలీవుడ్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తుండగా, ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# బుర్ర తక్కువై.. హనుమాన్ వదులుకున్నా

## నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు



బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.

# యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ఇంకా ఖరారు కాకపోవడం కూడా ఆలస్యానికి కారణమైందని తెలుస్తోంది. అలాగే కొన్ని ప్యాచ్ వర్క్ పనులు ఇంకా పూర్తికాకపోవడం, సెన్సార్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం కూడా వాయిదాకు దారితీసిన అంశాలుగా చెబుతున్నారు. అంతేకాకుండా పశ్చిమాసియాలో ఉన్న అనిశ్చిత పరిస్థితులు గ్లోబల్ రిలీజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మేకర్స్ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టుల పనుల్లో బిజీగా ఉండటంతో, పూర్తి స్థాయిలో ప్రమోషన్లపై దృష్టి సారించేందుకు సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కన్నడతో పాటు తెలుగు సహా ఆరు భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న 'టాక్సిక్', భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించే చిత్రంగా నిలుస్తుందని యష్ నమ్మకం వ్యక్తం చేశారు. విడుదల ఆలస్యమైనా, బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్




టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయా నికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది.థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మరోసారి ఈ యాక్షన్ ప్రేమకథను ఆస్వాదించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.